



వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

నేడు మంత్రి లోకేశ్ రాక

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):



రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ శనివారం నగరానికి వస్తున్నారు. మధ్యాహ్నం గన్నవరం నుంచి బయలుదేరి 2.50 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 3.30 గంటలకు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వస్తారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకూ పార్టీ కార్యాలయంలో ఉంటారు. సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి ఆర్కే బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొంటారు. ఆ కార్యక్రమం ముగిసిన అనంతరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని 8.10 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళతారు.

గ్రోత్ హబ్‌పై నీతిఆయోగ్ సూచనలు

- ప్రతి విభాగం నిర్దేశించిన అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సమర్పించాలన్న బృందం

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

విశాఖను గ్రోత్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి నీతి ఆయోగ్ బృందం పలు సూచనలు చేసింది.సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్, అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్ రాజు, వీఎంఆర్‌డీఏ సీఈ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు. గ్రోత్ హబ్ నివేదికను నీతి ఆయోగ్ బృందం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించింది. ప్రతి విభాగానికి నిర్దేశించిన అంశాలపై అధ్యయనం చేసి, నివేదికలు ఇవ్వాలని, ఆ తరువాత కార్యాచరణ ప్రారంభమవుతుందన్నారు.

విశాఖ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తాం

- అనేక కీలక సంస్థలు రాబోతున్నాయి
- మెట్రో రైలు డీపీఆర్‌ను ఆమోదించి కేంద్రానికి పంపించాం
- రైల్వే జోన్ భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం
- స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు అన్నిప్రయత్నాలూ చేస్తున్నాం
- సీప్లేన్ నడిపేందుకు గల అవకాశాలు పరిశీలన
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

విశాఖ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా విజన్ డాక్యు మెంట్‌ను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 'డీప్ టెక్నాలజీ'పై శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు అనంతరం మీడియాతో మాట్లాడారు. విజన్-2047లో భాగంగా విశాఖ కోసం ప్రత్యేకంగా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నట్టు సీఎం తెలిపారు.

విశాఖను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖ మెట్రో రైల్ డీపీఆర్‌ను ఆమోదించి కేంద్రానికి పంపించినట్టు చెప్పారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కాబోతోందని, భవన నిర్మాణ ప్రక్రియ త్వరలో మొదలవుతుందన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. విశాఖకు కూడా సీ ప్లేన్ అనుకూలతను పరిశీలిస్తున్నామని వివరించారు. రానున్న రోజుల్లో విశాఖ నగరం అన్ని రంగాల్లోనూ


... మిగతా 8వ పేజీలో



నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం 'డీప్ టెక్నాలజీ'పై నిర్వహించిన జాతీయ సదస్సులో 'ఏఐ'పై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. చిత్రంలో పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ టక్కర్, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ ప్రసాద్, 'గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్' డైరెక్టర్ సి.కుటుంబరావు ఉన్నారు



పార్టీ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు



సదస్సులో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

- పని ఒత్తిడి తగ్గించాలని కోరిన నర్సులు
- రెగ్యులర్ చేయాలని మలేరియా విభాగం కాంట్రాక్టు సిబ్బంది విజ్ఞప్తి
- కమీషన్ 9.5 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని కోరిన మద్యం డీలర్లు
- తమ ఆస్తులు కబ్జాకు గురయ్యాయని, విచారించి న్యాయం చేయాలని పలువురు వేడుకోలు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. గురువారం రాత్రి ముంబై నగరానికి చేరుకున్న ఆయన పార్టీ కార్యాలయంలో బస చేశారు. ముఖ్యమంత్రి నగరంలో ఉన్న విషయం తెలుసుకున్న పలువురు శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయానికి వచ్చారు. తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

నగరంలోని అల్లిపురం ప్రాంతంలో ఉంటున్న నరసింగరావు దంపతులు తమకు గోపాలపట్నంలో ఉన్న ఇంటిని వేరొకరు కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. కేజీహెచ్‌లో వాటర్ వర్క్సుకు సంబంధించి సూపరింటెండెంట్ బిల్లులు ఇవ్వడం లేదని, ప్రస్తుతం తాను అప్పుల్లో ఉన్నానని కాంట్రాక్టరు గణేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, టీచింగ్ ఆస్పత్రుల్లో పని ఒత్తిడి తగ్గించాలని, అవసరం మేర కొత్తగా నియామకాలు చేపట్టాలని, భద్రత పెంచాలని నర్సులు వినతిపత్రం సమర్పించారు. వారసత్వంగా వచ్చిన భూమిని గ్రామంలో కొందరు వారి పేరిట మ్యుటేషన్ చేయించుకున్నారని, విచారణ జరిపించి న్యాయం చేయాలని రాంబిల్లి మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన నాగుమంతు నరసింహరావు విజ్ఞాపనపత్రం సమర్పించారు. పాతికేళ్లుగా పని చేస్తున్న తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని మలేరియా విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది కోరారు. జీవీఎంసీ పరిధిలోని లక్ష్మీపురం ఏరియాలో తాను కొనుగోలు చేసిన స్థలాన్ని వైసీపీ నేత ఆక్రమించుకున్నారని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి సీహెచ్‌వీఎస్ నారాయణ ఫిర్యాదు చేశారు. పీఎం పాలెంలో మసీదును కొందరు అరాచకశక్తులు ఆక్రమించుకుని తోటి ముస్లింలను ఇబ్బందులు పెడుతున్నారని షేక్ సుభాని, టీడీపీ సానుభూతిపరుడననే అక్కసుతో ఏయూ మాజీ వీసీ తనకు రావల్సిన ఇంక్రిమెంట్లు నిలుపుదల చేశారని పరీక్షల విభాగం సూపరింటెండెంట్ నవర దావీదురావు ఫిర్యాదు చేశారు. మద్యంపై ప్రస్తుతం ఇస్తున్న 9.5 శాతం కమీషన్‌ను 20 శాతానికి పెంచాలని డీలర్లు కోరారు. 2020లో విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చిన

... మిగతా 8వ పేజీలో

నేడు పాఠశాలల్లో పండుగ

పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

- మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్...
- అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం
- పాఠశాల అభివృద్ధికి, బోధనకు సంబంధించి సూచనలు స్వీకరణ
- విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు భోజనం ఏర్పాట్లు
- 25 పాఠశాలలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు



ఓ పాఠశాలలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణకు విద్యా శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరగనున్నది. ఈ సందర్భంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం వరకూ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణకు జిల్లాకు రూ.15 లక్షలు విడుదలయ్యాయి. ఈ నిధులు సరిపోయే అవకాశం లేనందున ప్రతి పాఠశాలలో కాంపొజిట్ గ్రాంటు నుంచి కొంత మొత్తం ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించారు. తొలుత తల్లిదండ్రులకు సంబంధించి మహిళలకు ముగ్గులు పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. అనంతరం తల్లిదండ్రులతో సంబంధిత టీచర్ తరగతి గదిలో సమావేశమై ఇప్పటివరకూ నిర్వహించిన ఎఫ్ఏ-1, 2 పరీక్షల మార్కుల వివరాలతో కూడిన ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తారు. విద్యార్థులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షల వివరాలను కార్డులో పొందుపరుస్తున్నారు. విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, ఇతర అంశాలను తల్లిదండ్రులకు తెలియజేసి వారికి సూచనలు చేయడంతో పాటు సలహాలు స్వీకరిస్తారు. అనంతరం అన్ని తరగతుల విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధికి, బోధనకు సంబంధించి సూచనలు తీసుకుంటారు. ఆ తరువాత విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటుచేస్తారు. జిల్లాలోని 595 ప్రభుత్వ పాఠశాలల్లో

... మిగతా 8వ పేజీలో

నేడు ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

- దేశ, విదేశాల నుంచి సుమారు రెండు వేల మంది రాక
- ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ, విశిష్ట అతిథిగా మంత్రి నారా లోకేష్ హాజరు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం శనివారం ఆర్కే బీచ్ రోడ్డులోని వర్సిటీ కన్వెన్షన్ హాలులో జరగ నున్నది. ఈ వేడుకలకు దేశ, విదేశాల నుంచి సుమారు రెండు వేల మంది పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. వేడుకలకు నేరుగా హాజరు కాలేని వారి కోసం లైవ్ టెలీకాస్ట్ ఇవ్వనున్నారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వ హించేందుకు ఏయూ అధికారులతోపాటు పూర్వ విద్యార్థుల సంఘం (ఏఏఏ) ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అతిథులు, ప్రముఖులను ఆహ్వానించేందుకు, వారిని విభాగాలు, వేడుకలు జరిగే ప్రాంగణానికి తీసుకువెళ్లేందుకు, ఇంకా

... మిగతా 8వ పేజీలో

ఏయూ వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ ఏర్పాటయ్యేదెన్నడో!?



- ఇప్పటివరకూ ఖరారు కాని నామినీలు
- వీసీ పోస్టు కోసం భారీగా దరఖాస్తులు
- ప్రధానంగా పది మంది మధ్య పోటీ
- తమకు సన్నిహితులైన నేతల ద్వారా ప్రయత్నాలు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి ఉప కులపతి నియామకం మరికొంత ఆలస్యమయ్యేలా ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వీసీలను నియమించింది. ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శశిభూషణరావును ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమించింది. ఆ తరువాత పూర్తిస్థాయి వీసీలను నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని అనేక యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లతోపాటు పదవీ విరమణ చేసినవారు, సెంట్రల్ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్‌లు దరఖాస్తు చేసుకున్నారు.

ఏయూ వీసీ పోస్టును ఆశిస్తూ సుమారు 500 దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించేందుకు సెర్చ్ కమిటీని ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. యూజీసీ, ఏయూ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్కో పేరును సెర్చ్ కమిటీ ఏర్పాటుకు నామినేట్ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు నామినీ పేర్లను ఇవ్వాల్సిందిగా గతంలోనే ఉన్నత విద్యా శాఖ సర్క్యులర్ జారీచేసింది. యూజీసీ నామినీ పేరును కూడా ఖరారు చేసి పంపించింది. ఆంధ్ర యూనివర్సిటీ కూడా అక్టోబరు 25వ తేదీలోగా పేరు ఖరారు చేసి పంపించాలంటూ ఉన్నత విద్యా శాఖ కోరింది. అందుకు అనుగుణంగా అక్టోబరు 23వ తేదీన ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేసి పేరును ప్రతిపాదించాలని వర్సిటీ అధికారులు భావించారు. కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు చేశారు. అయితే, అనూహ్యంగా కౌన్సిల్ సమావేశం వాయిదాపడింది. ఉన్నత విద్యా శాఖ అధికారి ఎగ్జిక్యూటివ్ సమావేశంలో పాల్గొనేందుకు అవకాశం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేయాలంటూ వర్సిటీ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో ఈసీ వాయిదా పడింది. ఆ తరువాత సమావేశం ఏర్పాటుకు

... మిగతా 8వ పేజీలో

ఆర్టీసీ జాతీయస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



నగరంలోని కైలాసగిరి సమీపంలో గల పోలీస్ మైదానంలో శుక్రవారం అఖిల భారత రవాణా సంస్థల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్‌తో పాటు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ పాల్గొన్నారు.

... మెయిన్‌లో

రెవెన్యూ సదస్సులు ప్రారంభం

- తొలి రోజు 181 వినతులు
- అధికశాతం మ్యుటేషన్ల కోసం వచ్చినవే

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని ఏడు మండలాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. పెందుర్తి, గోపాలపట్నం, ములగాడ, పెదగంట్యాడ మండలాల్లో సదస్సులు జరగలేదు. ముఖ్యమంత్రి నగరంలో ఉండడంతో తాము అందుబాటులో ఉండబోమని ప్రజా ప్రతినిధులు చెప్పడంతో ఆ నాలుగు మండలాల్లో సభలు వాయిదా వేశారు. తొలిరోజు నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 181 వినతులు అందాయి. ఒక్క పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన సదస్సులోనే 80 వినతులు అందాయి. వాటిలో ఎక్కువగా మ్యుటేషన్స్ (రికార్డుల్లో పేర్లు నమోదు)కు సంబంధించినవే ఉన్నాయి. మహారాణిపేట మండలంలో 20, అర్బన్ మండలంలో 16, ఆనందపురంలో 15, గాజువాకలో 13, భీమిలిలో తొమ్మిది వినతులు వచ్చాయి. ఆస్తులకు సంబంధించి వారసుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేయాల్సి ఉంటుంది. కానీ చేయడం లేదు. కుటుంబాల్లో తగాదాల వల్ల కొన్నిచోట్ల ఇబ్బందులుండగా, రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ మ్యుటేషన్ల సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని సదస్సులకు హాజరైనవారు అభిప్రాయపడ్డారు. నగరంలో యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణపై ఎక్కువగా వినతులు వచ్చాయి. అలాగే పింఛన్, రేషన్ కార్డు, తదితర అంశాలపై పలుచోట్ల వినతులు అందాయి.

విజయశ్రీ ఫార్మాలో ప్రమాదం

- ఇద్దరికి గాయాలు

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని విజయశ్రీ ఆర్గానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు.

... మెయిన్‌లో



అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి 98వ వార్డు సింహాచలం గ్రామానికి చెందిన శీర లక్ష్మీ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని డీడీ రూపంలో ఆమె దేవాలయ ఏఈఓ ఆనందకుమార్‌కు శుక్రవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబీకులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రం, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :మండలంలో తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆ పథకం జిల్లా పరిశీలకుడు జేవీ శాస్త్రి శుక్రవారం పరిశీలించారు.విద్యార్థులను మెనూ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ బి.సోమేశ్వరరావు, హెచ్ఎం డి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రసాదరావు,అప్పలనాయుడు, దూవికల శ్రీను, మురళీ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో కొమ్మాది విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేశ్

కొమ్మాది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ కె. సురేశ్ తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్న కోటి యామినిరావు ప్రతిభ చూపడంతో నిర్వాహకులు ఆమెను 43వ జూనియర్ అఖిల భారత జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక చేశారు. ఈమేరకు ఈనెల 7, 8, 9 తేదీల్లో అనంతపురం జిల్లా నరపల మండలం నేతాజీ పాఠశాలలో జరగనున్న పోటీల్లో ఆమె పాల్గొనుంది. కాగా శుక్రవారం కళాశాలలో విద్యార్థిని ప్రిన్సిపాల్ సురేశ్, ఫైనాన్స్ డైరెక్టర్ మాదవి, పీడి వేణుగోపాలరావు, సునీల్ అభినందించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కొమ్మాది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాదిలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొలగాని సన్యాసిరావు, గొల్లంగి ఆనందబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు బొట్టాదాస్, బైపిల్లి పైడిరాజు, గుంటుబోయిన వెంకటరమణ, పాల్గొన్నారు.

రుషికొండ తీరంలో డాల్ఫిన్ కళేబరం



సాగర్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాడిసన్ బ్లూ వెనుక ఉన్న సముద్ర తీరంలో డాల్ఫిన్ కళేబరం ఒకటి శుక్రవారం కొట్టుకు వచ్చింది. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన వరుస తుఫాన్ల వల్ల డాల్ఫిన్ మృత్యువాత పడి ఉంటుందని మత్స్యకారులు భావిస్తున్నారు. అతి శీతల వాతావరణంలో జీవించే డాల్ఫిన్లు తరచూ విశాఖ తీరం వైపు వచ్చి పలు కారణాలతో మృత్యువాత పడుతున్నాయి.

వాటర్ ఫిల్టర్ వితరణ

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ దివీస్ కంపెనీ చిన నాగమయ్యపాలెం ప్రాథమిక పాఠశాలకు నీటి శుద్ధి యంత్రాన్ని శుక్రవారం వితరణగా అందజేసింది. దీని విలువ రూ. 1.25 లక్షలు అని దివీస్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్మాగారం సామాజిక సేవా విభాగం మేనేజరు డి. సురేశ్, నరసింహ, శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురం : గొట్టిపల్లి సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌డీఓ సంగీత్ మాధూర్



భీమిలి : రెవెన్యూ సదస్సుల ప్రాధాన్యతను వివరిస్తున్న హెచ్‌డిటి శ్రీనుబాబు

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాధూర్

ఆనందపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాధూర్ అన్నారు. శుక్రవారం ఆయన గొట్టిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లయితే అర్జీల రూపంలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రధానంగా భూ వివాదాలు, నిషేధిత జాబితాలో నమోదైన రైతుల భూములు తొలగింపు,మ్యూటేషన్లు, ఇటీవల జరిగిన రీసర్వేలో ఏర్పడిన వివాదాలపై వినతులు స్వీకరిస్తామని చెప్పారు. వచ్చిన వినతుల సమగ్ర పరిశీలన అనంతరం పూర్తి వివరాలు తీసుకుని సమస్యను పరిస్తా మని తెలిపారు. భూ సమస్యలు లేని గ్రామాలను తీర్చిదిద్దడమే సదస్సుల ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం 15 మంది రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఆర్‌ఐ ఉమాదేవి, రీ సర్వే డిటి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో తొమ్మిది వినతులు

భీమునిపట్నం : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తొమ్మిది వినతులు అందించారు. ఎండోమెంట్ స్థలాలకు సంబంధించి పట్టణంలో ఉన్న లంగరుఖానా సత్రం,విశాఖ ప్రేమ సమాజం, గంధం రామస్వామి సత్రం, లార్డు రిప్పన్ పూర్ హౌస్, మాన్సాస్ స్థలాలతో పాటు బీచ్‌రోడ్‌లో వున్న జలగెడ్డ మత్స్యకార శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, హెచ్‌డిటి సూరిశెట్టి శ్రీనుబాబు, జోనల్ కార్యాలయం సర్వేయర్ సూర్యనారాయణ, దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఒక చక్కని వేదిక అని హెచ్‌పీసీఎల్ డిప్యూటీ కలెక్టర్, మండల రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి సన్నపల్లి సుధాసాగర్ అన్నారు. శుక్రవారం రెడ్డిపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ కె. ఆనందరావు మాట్లాడుతూ సదస్సులో పలు సమస్యలపై రైతులు 80 వినతులు అందించారని తెలిపారు. అనంతరం అధికా రులు రెడ్డిపల్లి కొట్ల గుండం చెరువు సమీపంలో ఉన్న భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదరరావు, ఆదిబాబు, ఈర్ల రాజేశ్వరి, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈవో



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేజీబీవీని డీఈఓ ప్రేమ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం జరగనున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమం ఏర్పాట్ల గురించి ప్రిన్సిపాల్ కుమారిని అడిగి తెలుసుకున్నారు.అలాగే పేరెంట్ టీచర్, కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీలను పరిశీలించారు. అనంతరం విద్యాలయంలో ఉన్న స్టోర్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు జీసీడీఓ కలిషా బేగం ఉన్నారు.

వెంకన్న సన్నిధిలో సుదర్శన హవనం



హవనం చేస్తున్న రుత్విక్‌లు

సింహాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి కొండదిగువ ఉద్యానవనంలో ఉన్న పద్మావతి, అలిమేల్ మంగా సమేత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం సుదర్శన హవనాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి నెలల్లో వచ్చే స్వామివారి ఆవిర్భావ నక్షత్రం శ్రవణం పురస్కరించుకుని హవనం చేయడం ఆనవాయితీ. ఈమేరకు వేకువజామున ప్రభాతారాధనలు తరువాత యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. శాస్త్ర విధానంలో కలశారాధన, బింబారాధన, మండపారాధన చేసి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. పంచ సూక్తాలతో, సుదర్శన మూల మంత్రాలతో హవనాన్ని నిర్వహించి, పూర్ణాహుతి జరి పారు. తరువాత ప్రధాన కలశాన్ని ఆలయ అర్చకులు శిరస్సున దాల్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అంతరాలయంలో స్వామివారి చెంత ఉంచి పూజలు చేశారు. అందులోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ జరిపారు.

గీతంలో చెస్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న గౌతమ్‌రావు

ఎండాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయూ) ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న అంతర విశ్వవిద్యాలయాల మహిళా చెస్ పోటీలను గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, గీతం కార్యదర్శి ఎం. భరద్వాజ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 300 మంది క్రీడాకారులతో పాటు 100 మంది మేనేజర్లు, 10 మంది అధికారులు హాజరయ్యారని వివరించారు. విజేతలను త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీ లకు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, గీతం విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, గీతం క్రీడా విభాగం డైరెక్టర్ యు. విజయ్ కుమార్, మేనేజర్ రితేశ్ సిన్హా, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

సాగర్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఆవరణలో నిలిపి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మెగా పండగకు ఏర్పాట్లు పూర్తి

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాఠశాలల్లో శనివారం జరగనున్న మెగా పండగ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్. హనుమంతరావు కోరారు. శుక్రవారం ఆయన ఎంఈవోలు ఎం. శివరాణి, జయప్రదతో కలిసి పలు పాఠశాలలను సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలకు మెగా పేరెంట్స్, టీచర్ కార్యక్రమం, విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీపై సూచనలు చేశారు.

పద్మనాభం రూరల్ : పాఠశాలల్లో జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని పండగ వాతావరణంలో చేపట్టాలనిఎంఈఓ పి. రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో అన్ని పాఠశాలల హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడి వైపు అడుగు అన్న ఆలోచనతో కూటమి పాలనలో విద్యా శాఖ మొదటిసారిగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని పాఠశాలల్లో పండగ వాతావరణంలో నిర్వహించాలని కోరారు. తల్లిదండ్రులకు పలు పోటీలతో పాటు విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంఈవో 2 బాబులాల్, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ శనివారం మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంఈఓలు శివరాణి, జయప్రద తెలిపారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

షిప్ యార్డుకు రెండు అవార్డులు



హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌కు రెండు అవార్డులు లభించాయి. ఈమేరకు న్యూఢిల్లీలోని షాంగ్రి-లాలో శుక్రవారం జరిగిన 3వ పీఎస్‌యూ ట్రాన్స్‌ఫర్మేషన్ వేడుకల్లో షిప్‌యార్డు ఉన్నతాధికారులు అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశరత్ చంద్ర, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం, ఆంధ్రజ్యోతి

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

- వాడవాడలా వర్ధంతి సభలు
- సేవలను కొనియాడిన నాయకులు



గిరిజన భవన్‌లో నివాళి అర్పిస్తున్న ఈడీ రాణిమంద

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సభలు శుక్రవారం జరిగాయి. భీమిలిలో డైట్ జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు జలగడుగుల మురళి, కుప్పిలి గురుమూర్తి, గూడుపు రాజు, నాగరాజు, సంజీవ్, పోలిరాజు, పోతురాజు, అప్పన్న, సత్యారావు పాల్గొన్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనపర్తి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 3వ వార్డు వైసీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జోనల్ కార్యాలయంలో జడ్పీ ప్రసన్న వాణి, సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, ఆర్ఓ నరసింగరావు, ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవో ఎం.శివరాణి, తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. డైట్ జంక్షన్‌లో ఆర్డీవో సంగీత్ మాధూర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు దుమ్మెద అప్పలసూరి, జలగడుగుల శ్రీనివాస్, ప్రొఫెసర్ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వేములవలసలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు.కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రసాదరావు పట్నాయక్, కూరాకుల వెంకటేశ్ పాల్గొన్నారు. ఆనందపురం, వెల్లంకి, రామవరం, గండిగుండం, శొంఠ్యాం, గిడిజాల, తర్లువాడలోనూ అంబేడ్కర్ వర్ధంతి సభలు జరిగాయి.

తగరపువలస : తగరపువలస, చిల్లపేటలోనూ అంబేడ్కర్ వర్ధంతి సభలు జరిగాయి. వైసీపీ నాయకులు చిల్లపేటలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జీరు వెంకటరెడ్డి, 1, 2 వార్డులకు చెందిన నాయకులు ఉప్పాడ నాగేశ్వరరావు, శిల్ల కరుణాకరరెడ్డి, అక్కరమాని రామునాయుడు పాల్గొన్నారు. తగరపువలస సీపీఐ కార్యాలయంలో కానూరి రాంబాబు అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మావూరి వీర్రాజు, రాంపైడి, గోవిందరావు, మోర అప్పలరాజు పాల్గొన్నారు. తగరపువలస కూడలిలో ఎస్సీ సెల్ భీమిలి రూరల్ అధ్యక్షుడు సామంతుల సత్తిరాజు ఆధ్వర్యంలో పలువురు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

విశాలాక్షినగర్ : కైలాసగిరి ప్రధాన రహదారిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి 9వ వార్డు టీడీపీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వెంపాడ శ్రీను, ఎస్సీ, ఎస్టీ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నాగరాజు, శామ్యూల్, తారక్, భారతి, సత్య, పకీర్ నాయక్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : రుషికొండ గిరిజన భవన్ (టీసీఆర్ అండ్ టీఎం)లో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఈడీ రాణిమంద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు.

సింహాచలం : అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజలకు శ్రీరామ రక్ష అని 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం అన్నారు. పాత అడివివరం అంబేడ్కర్ కాలనీకి చెందిన నవయువ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు.

కొమ్మాది : అంబేడ్కర్ ఒక కులానికో, మతానికో చెందిన వ్యక్తి కాదని.. ఆయన దేశ ప్రజల ఆస్తి అని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జోన్-2 కార్యాలయం వద్ద జరిగిన సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోతిన హనుమంతురావు, కుడితి రామారావు, ముచ్చు రామారావు, జామి శివ, జేఎస్ఎస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొమ్మాదిలో అంబేడ్కర్ విగ్రహానికి హనుమాన్ యూత్ సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

పద్మనాభం రూరల్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని తహసీల్దార్ కె. ఆనందరావు అన్నారు. శుక్రవారం ఆయన రెడ్డిపల్లి సచివాలయం ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.



భీమిలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు



తగరపువలస : అంబేడ్కర్ చిత్రపటం వద్ద సీపీఐ నాయకుల నివాళి



వినతిపత్రం చదువుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పక్కన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

పంచ గ్రామాల భూ సమస్యపై సీఎంకు వినతి

వేపగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా గోవింద్ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వై. జగదీశ్ వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో సీఎంను కలిసి సమస్య తీవ్రతను వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు.

ముగిసిన కళా ఉత్సవ్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న కళా ఉత్సవ్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయిలో నిర్వహించిన ఉత్సవ్‌లో 12 పాఠశాలలు, రెండు కళాశాలల నుంచి 125 మంది కళాకారులు హాజరై, పలు ప్రదర్శలిచ్చారన్నారు.గాత్రం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటక రంగం, దృశ్య కళలు, సంప్రదాయ కథలు చెప్పడంలో పోటీలు జరిగాయని చెప్పారు. ప్రథమ బహుమతి పొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారన్నారు. గాత్రంలో స్నేహిత, ఆర్. రమ్య, ఎ. లలితశ్రీ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వాయిద్య సంగీతంలో పీఎన్ఎం హైస్కూల్ (భీమిలి), జడ్పీ హెచ్ఎస్ (నడుపూరు),జడ్పీహెచ్ఎస్ (కాశీపురం), నృత్యంలో కె. రేష్మిత అపూర్వ (నారాయణ కాలేజీ, అనకాపల్లి),ఈర్ని నిఖిత (సీబీఎం హెచ్ఎస్, భీమిలి),సీహెచ్ సౌజన్య (అంబేడ్కర్ గురుకులం, తాళ్లపాలెం)కు వరుసమూడు స్థానాల్లో నిలిచారు. నాటక రంగంలో నడుపూరు, ఆరిపాక, కాశీపురం విద్యార్థులు, దృశ్య కళలో పి. ఇంద్రకరన్, బి. జశ్వంత్, బి. జ్యోతి, సంప్రదాయ కథల విభాగంలో ఎస్. శిరీష, సీహెచ్ ఎల్లాజీ, కె. భావన విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపాల్ జ్యోతికుమారి వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు ఎల్. సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, జె. మాధవి, సోమయాజులు, ఎస్. త్రినాథరావు, ఎం. మహాలక్ష్మి, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

... 7వ పేజీ తరువాయి

ముందుండేలా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. తనపై విశాఖ ప్రజలు ఎంతో నమ్మకాన్ని ఉంచి ఆదరించారన్నారు. ఇక్కడి ప్రజలు ఎంతో మంచివాళ్లని, టీడీపీపై ఎంతో అభిమానాన్ని కలిగి ఉన్నారన్నారు. విశాఖ వాసులు కమిటెడ్‌గా ఉంటారన్నారు. తాను ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలను చూశానని, ఇటువంటి భిన్నమైన నగరాన్ని ఎక్కడా చూడలేదన్నారు. మంచి, చెడులను గమనించి నిర్ణయాలు తీసుకోవడంలో ఇక్కడి ప్రజలు ముందుంటారన్నారు. ఒకప్పుడు ఐటీని ప్రమోట్ చేశామని, ఇప్పుడు డీప్ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నామన్నారు. విశాఖలో అనేక కీలక సంస్థలు తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయన్నారు.

ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

... 7వ పేజీ తరువాయి

తమను (చంద్రబాబు) అడ్డుకున్న వైసీపీ నేతలపై చర్యలు విషయంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని టీడీపీ పీఆర్వో కె.గోపాలరెడ్డి ఫిర్యాదు చేశారు. వైసీపీ కీలక వ్యక్తులను ఉద్దేశపూర్వకంగా అప్పటి పోలీసులు తప్పించి, సామాన్య కార్యకర్తల పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వైసీపీ నాయకుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పాఠశాలల్లో పండుగ

... 7వ పేజీ తరువాయి

ఒకటి నుంచి పదో తరగతి వరకు 77,165 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 72,918 మంది విద్యార్థులు పాఠశాలల్లో భోజనం చేస్తున్నారు. అదనంగా మరో 60 వేల మందికి భోజనం సిద్ధం చేస్తున్నారు. మెనూ ప్రకారం అన్నం, పప్పుచారు, కూర, స్వీట్ పొంగలి, శనగపప్పు చిక్కీ అందిస్తారు. ఉదయం తల్లులకు రాగి జావ అందజేస్తారు. నగరంతోపాటు, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో భోజనం సరఫరా చేసే అక్షయపాత్ర ఏజెన్సీ ఒక్కటే 75 వేల మందికి ఆహారం సిద్ధం చేస్తోంది. కాగా జిల్లాలో పేరెంట్, టీచర్ మీటింగ్‌కు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనేందుకు 25 పాఠశాలలను ఎంపిక చేశారు. శనివారం నిర్వహించనున్న సమావేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు.

నేడు ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

... 7వ పేజీ తరువాయి

కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ స్నాక్స్ పంపిణీ, గుర్తింపు కార్డులు పరిశీలించి లోపలకు పంపించేందుకు సీనియర్ ఫ్యాకల్టీ 30 మందితో పది కమిటీలను ఏర్పాటు చేశారు.

అతిథులు...

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ సంస్థ ఛైర్మన్, మేనే జింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ, విశిష్ట అతిథిగా విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గ్రంధి మల్లికార్జునరావు, ఛైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావుతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకానున్నారు.

ఇదీ షెడ్యూల్..

బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 5.30 గంటలకు అతిథుల ప్రసంగాలు ప్రారంభమవుతాయి. ఇవి రెండు గంటలు కొనసాగుతాయి. రాత్రి 8 గంటలకు వేడుకలు ముగియనున్నాయి.

ఏయూ వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ ఏర్పాటయ్యేదెన్నడో!?

... 7వ పేజీ తరువాయి

సంబంధించి ఉన్నత విద్యా శాఖ నుంచి వర్సిటీ అధికారులకు సమాచారం రాకపోవడంతో ఏయూ నుంచి నామినీ పేరును ఖరారు చేయడం సాధ్యం కాలేదు. దీంతో ఇప్పటివరకూ సెర్చ్ కమిటీ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు.

ఆశావహుల్లో ఉత్కంఠ

ఏయూ పూర్తిస్థాయి వైస్ చాన్సలర్‌గా వచ్చేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. ఈ జాబితాలో సుమారు పది మంది పేర్లు ప్రముఖంగా వినిపి స్తున్నాయి. వీరంతా తమ స్థాయిల్లో ప్రయత్నాలను సాగిస్తున్నారు. మంత్రి నారా లోకేష్‌తో పాటు ఎంపీ శ్రీభరత్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ద్వారా కొందరు సీనియర్ ప్రొఫెసర్లు తమ ప్రయత్నాలను సాగిస్తున్నారు. మరికొందరు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నగర పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎవరికి అవకాశాన్ని కల్పిస్తుందో చూడాలి. ఏదిఏమైనా సెర్చ్ కమిటీ ఏర్పాటైతేనే గానీ వీసీ ఎంపిక ప్రక్రియ ముందుకుసాగదు.

☛ సంక్షిప్తంగా..

బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో జరుగుతున్న డీఎస్సీ ఎస్జీటీ కోసం జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని బీసీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు వంటివి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విజయం సాధించడానికి నిరంతరం సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

అభివృద్ధికి మూలం హిందీ భాష

» డాక్టర్ శివమ్ తివారీ



శివమ్ తివారీని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హిందీ భాష మన అభివృద్ధికి మూలమని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అవధీ సాహిత్య సంస్థాన్ కార్యదర్శి డాక్టర్ శివమ్ తివారీ అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాయత్రీ విద్యా పరిషత్‌లో 'హిందీ భాష ద్వారా సరికొత్త అవకాశాలు-ఉపాధి' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త విచ్చేసిన డాక్టర్ శివమ్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. హిందీ ప్రాశస్త్యం వివరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య బోస్, యూజీ కోర్సుల డైరెక్టర్ గిరిధర్, డాక్టర్ అనిత, డాక్టర్ రమణి, పీఆర్వో శేష పద్మ, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ శాస్త్రి, శ్రీనివాసన్, డాక్టర్ ఇలాహి షేక్ పాల్గొన్నారు.

డా.అబ్దుల్‌ఖాన్‌కు శ్రీవాస్తవ అవార్డు



ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్థోపెడిక్ విభాగంలో జాతీయ స్థాయిలో శ్రీవాస్తవ మెడల్ అవార్డుకు అపోలో ఆస్పత్రికి చెందిన డాక్టర్ అబ్దుల్‌ఖాన్ ఎంపికయ్యారు. బెంగళూరులో ఈ నెలలో జరగనున్న ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వార్షిక ఆవార్డును అందుకోనున్నట్టు ఆయన తెలిపారు. ఆయన రాసిన ఆర్థ్రైటీస్, రుమటైటీస్ ఆర్థరైటీస్, మోకాల్ల మార్పిడికి సంబంధించిన శాస్త్రీయ కథనాలను పరిశీలించి ఈ అవార్డు ప్రకటించినట్టు అవార్డు కమిటీ పేర్కొంది.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 46, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 28, క్యారెట్ 64 దొండకాయలు 32, బంగాళ దుంపలు 38, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 50, బరబాటి 28, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 32 దోస కాయలు 20, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండ ఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	85
ఫారం ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	290

రోడ్డు అంతా 'వ్యర్థమే'!

» డెబ్రిస్ కుప్పలతో నిండిపోయిన ముడసర్లోవ ఎగువ భాగం రహదారి
» లారీలతో తెచ్చి పడేస్తున్నా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
» ఈ మార్గంలో వాహనాలు తిరగలేని పరిస్థితి



రోడ్డుకు సగం వరకూ నిండిపోయిన డెబ్రిస్

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని ముడసర్లోవ ఎగువ భాగంలో గల రోడ్డంతా డెబ్రిస్‌తో నిండిపోయింది. వ్యర్థాల కుప్పలు పెరిగిపోతున్నా జీవీఎంసీ అధికారులు మాత్రం వాటి తొలగింపునకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవీఎంసీ నిధులు రూ.12 కోట్లతో ఈ రోడ్డు వేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిండా డెబ్రిస్ కుప్పలతో నిండిపోయింది. రోడ్డు పొడవునా రెండు వైపులా చెత్తాచెదారం కుప్పలు ఉన్నాయి. ఇవి రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రోడ్డు ఉంది కదా అనే ఉద్దేశంతో ఇక్కడ స్థానికులు అనేక వ్యర్థాలను తెచ్చి పడేస్తున్నారు. ప్రస్తుతం ఈ రహదారి పరిస్థితి చూస్తే రాకపోకలకు కంటే వ్యర్థాలను వేయడానికే అధికంగా ఉపయోగిస్తున్నారనే సందేహం కలుగుతుంది.

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇక్కడ ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారు. లారీలతో ఇసుక తెచ్చి రోడ్డు చివరి భాగంలో డంపింగ్ చేసేవారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఇక్కడ ఇసుక రీచ్‌లను ఎత్తేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డు నిర్వహణపై జీవీఎంసీ కూడా దృష్టి సారించడం లేదు. దీంతో నిర్మాణ వ్యర్థాలు వేసేందుకు స్థానికులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కొందరు లారీలతో చెత్తను తీసుకొచ్చి ఇక్కడ డంపింగ్ చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



రోడ్డు పొడువునా వ్యర్థాల కుప్పలు

ప్రస్తుతం రైల్వే జోనల్ కార్యాలయం నిర్మాణానికి ఈ ప్రాంతంలోని 26వ సర్వే నంబర్‌లో గల 52 ఎకరాలను కేటాయించారు. ఆ పనులు చేపట్టేందుకు కూడా ఈ మార్గాన్నే ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే డెబ్రిస్ కుప్పలు ఉండడంతో ఆ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. పదేళ్ల కిందట ఈ రోడ్డు ఇదే విధంగా వ్యర్థాల కుప్పలతో నిండి ఉండేది. జీవీఎంసీ అధికారులు స్పందించి వాటిని తొలగించారు. పెద్ద వాహనాలు వెళ్లకుండా గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ కాపలా ఏర్పాటు చేసి ఎవరైనా డెబ్రిస్ తెచ్చి వేస్తే జరిమానా విధించేవారు. దీంతో కొన్నాళ్లు ఇక్కడకు డెబ్రిస్ వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు అక్కడ ఎలాంటి కాపలా లేదు, గడ్డర్లను కూడా ఎవరో తొలగించారు. దీంతో డెబ్రిస్ పారబోసేందుకు ఎలాంటి అడ్డులేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఈ రోడ్డుపై ఉన్న డ్రెబిస్ కుప్పలను తొలగించడమే కాకుండా ఎవరూ చెత్తను పారబోయకుండా చర్యలు తీసుకోవాల్సిలని స్థానికులు కోరుతున్నారు.

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

వర్ధంతి సందర్భంగా పలు చోట్ల ఘన నివాళి



జీవీఎంసీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్, ఇతర అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభ్యుదాయానికి ఎంతో కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో డాక్టర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.

అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఏయూలో ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి అర్పించారు. ఏయూ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వీసీ జి.శశిభూషణరావు పూలమాలల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దార్శనికత, సమగ్రత కలిగిన అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను నేటితరం యువత ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల పెదగదిలి జంక్షన్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పలువురు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ మేధస్సు భారతదేవానికి ఎంతో ఉపయోగపడిందన్నారు. ఆయన ఆశయాలు ఏనాటికీ స్ఫూర్తిదాయకమన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ వెలుగు దివిటీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యదర్శి ఒమ్మి పోలారావు, టీడీపీ నేతలు యల్లమల్లి సురేష్, మజ్జి రమణి, బలగ సుధాకర్, కొండమ్మ, రేఖాజ్యోతి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆరిలోవలో అంబేడ్కర్‌కు టీడీపీ నేతల నివాళి



ఏయూలో అంబేడ్కర్‌క నివాళులు అర్పిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభం రేపు

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌కు సమీపంలోని విమ్స్ ప్రాంగణంలో నిర్మాణం జరుగుతున్న ఆరిలోవ పోలీసుస్టేషన్ పనులను శుక్రవారం ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పరిశీలించారు. ఈ పోలీసుస్టేషన్‌ను ఆదివారం 11 గంటలకు ప్రారంభించనున్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించనున్నారు. దీంతో ఎట్టకేలకు ఆరిలోవ పోలీసుస్టేషన్ కల నెరవేరనున్నది.

ఇప్పటి వరకూ ఇక్కడ పోలీసుస్టేషన్ చిన్న భవనంలో ఉంది. ఇరుకైన గదులు ఉండేవి. దీంతో ఏదో సర్దుకొని వెళ్లడం తప్ప సిబ్బందికి వేరే ప్రత్యామ్నాయం ఉండేది కాదు. ఫిర్యాదులు చేయడానికి వచ్చే వారు సైతం చాలా ఇబ్బందులు పడేవారు. కూర్చోవడానికి వసతులు కూడా లేని పరిస్థితి. మహిళా పోలీసు సిబ్బంది ఇబ్బందులైతే వర్ణనాతీతంగా ఉండేవి. ఇప్పుడు కొత్త పోలీసు స్టేషన్ భవనం అందుబాటులోకి వస్తుండడంతో తమ బాధలు తీరాయని స్టేషన్ సిబ్బంది సంబర పడుతున్నారు.

ఒక ఎకరా స్థలంలో సుమారు రూ.2.75 కోట్ల వ్యయంతో 17 గదులతో ఈ పోలీసుస్టేషన్ భవనం రూపుదిద్దారు. మొదటి అంతస్తు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2019లో అప్పటి రాష్ట్ర హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికలు రాగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణ పనులు పెద్దగా జరగలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో వెంటనే నిధులు విడుదల చేసి పనులు చకచకా పూర్తి చేశారు. అవసరమైన ఫర్నిచర్ కూడా సమకూర్చారు. దీంతో నూతన పోలీసుస్టేషన్ ఆదివారం నుంచి అందుబాటులోకి వస్తుండడంతో ఇక్కడి పోలీసు సిబ్బంది, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నూతన భవనాన్నిపరిశీలిస్తున్నఏసీపీ నరసింహమూర్తి



ప్రారంభానికి సిద్ధమైన పోలీసుస్టేషన్ భవనం

సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత



మౌనికకు సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యానికి గురైన చిన్నారి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు. చిన్నారి ఎస్.మౌనిక అనారోగ్యం కారణంగా బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం అందించారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను మౌనికకు ఎమ్మెల్యే అందజేశారు.

అలరించిన నాటక ప్రదర్శనలు

మద్దిలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'రాయి', 'బంధనం' నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గెద్ద వరప్రసాద్ దర్శకత్వంలో రెండు నాటకాల్లో కళాకారులు తమ అద్భుత నటనతో ప్రేక్షకులను మెప్పించారు.

సమాజంలో పేదవారిని దోచుకుంటున్న బలవంతులు, ధనవంతులపై పేదవారు తిరగబడితే ఏవిధంగా ఉంటుందో 'రాయి' నాటకంలో కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో ప్రేమతో పెంచి ప్రయోజకులను చేస్తారు. పిల్లలు ప్రయోజకులయ్యాక అప్పటికే వృద్ధులైన తల్లిదండ్రులను ఎంత దారుణంగా చూస్తున్నారో 'బంధనం' నాటిక ద్వారా తెలియజేశారు.

ఈ సందర్భంగా దివంగత బాదంగీర్ సాయి సంతాప సభ ఏర్పాటు చేశారు. అకాడమీ నిర్వాహకులు సాయి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.



నాటకంలోని ఓ రసవత్తర సన్నివేశం

వింటర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు ఏయూ విద్యార్థి ప్రేమ్‌కుమార్ ఎంపిక

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ నిర్వహించే వింటర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం-2024కు ఏయూ విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం మొదటి సంవత్సరం విద్యార్థి వన్నల ప్రేమ్‌కుమార్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు శుక్రవారం ఆయన కార్యాలయంలో ప్రేమ్‌కుమార్‌ను అభినందించి ఇంటర్న్‌షిప్ ఉత్తర్వులను అందించారు. రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయ్‌రావు విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి పి.ప్రేమానందం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం ఒకే విద్యార్థి ఈ జాతీయ స్థాయి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు ఎంపిక కావడం అది కూడా తమ విభాగానికి చెందిన విద్యార్థి ప్రేమ్‌కుమార్ కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 16నుంచి 2025, జనవరి 10వ తేదీ వరకు ఢిల్లీలో ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనేత అంబేడ్కర్

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఘన నివాళి

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆదర్శనీయుడని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వైసత్యకుమార్ శ్లాఘించారు. ఆయనకు మాత్రమే జయంతి, వర్ధంతులు ప్రభుత్వపరంగా నిర్వహించడానికి దేశానికి చేసిన ఎనలేని సేవ కారణమన్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం డాబాగార్డెన్స్ ఎల్‌ఐసీ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల కాలంలో ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన స్ఫూర్తితో పనిచేస్తున్నామన్నారు. అంబేడ్కర్ జన్మించి, నడయాడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ, ఆయన అందించిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని, ఫలాలను ప్రజలకు అందించే కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, లక్ష్మీనారాయణ, సుహాసిని, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సీతంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెం బస్టాప్ వద్ద చెత్త కాగితాలు ఏరుకుంటూ వాటిని అమ్ముకొని జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు నాలుగో పట్టణ పోలీసులు వివరాలు నమోదు చేసుకుని, అతడు ఎవరన్నది ఆరా తీస్తున్నారు. అతడి వయసు 45-50 ఏళ్లుంటాయని, మోహన్ అని పిలుస్తుంటారని తెలిసింది. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారని, వివరాలు తెలిసిన వారు 94407 06012 ఫోను నెంబర్‌కి లేదా తమకు తెలియజేయాలని నాలుగో పట్టణ పోలీసులు కోరారు.

8న బ్రాహ్మణ కులస్థుల ఆత్మీయ కలయిక

ఆటోనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న పెదగంట్యాడ ఆటోనగర్ గంగవరం రహదారిలో విశాఖ బ్రాహ్మణ కులస్థుల ఆత్మీయ కలయిక, వన సమారాధన నిర్వహిస్తున్నట్టు బ్రాహ్మణ కులసంఘం సెక్రటరీ నాగేంద్ర పరిమి, ఐలా కమిటీ సభ్యులు చుండూరు విశాలాక్షి తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్‌సీ, డీఐసీ, ఎస్‌బీఐసీ బ్యాంకులు, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలు పాల్గొంటాయన్నారు. అక్కడ వివిధ కంపెనీల ఎక్స్‌పో నిర్వహిస్తున్నామనీ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు నూతన వ్యాపార అవకాశాలపై అవగాహనను కల్పిస్తాయన్నారు. బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో లక్ష్మి, శర్మ, బీజేపీ మూర్తి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నానో మెటీరియల్స్‌తో బహుళ ప్రయోజనాలు

గ్లోబల్‌క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ విభాగాధిపతి దేవా పురాణం



డాక్టర్ హెచ్ పురాణంను సన్మానిస్తున్న నిర్వాహకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నానో మెటీరియల్స్ బహుళ ప్రయోజనాలను కలిగి ఉన్నాయని అమెరికాలోని వైరటీస్ సంస్థ, గ్లోబల్ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ విభాగాధిపతి డాక్టర్ దేవా హెచ్ పురాణం అన్నారు. ఏయూ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ సదస్సు నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ కెటాలసిస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎనర్జీ, కెటాలసిస్, ఎన్విరాన్మెంట్ రంగాలలో నానో మెటీరియల్స్‌ను ఉపయోగించే విధానాలు, వాటి ఉపయోగాలను విద్యార్థులు, పరిశోధకులకు వివరించారు. విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని అన్వయించడం, వర్తమాన అవసరాలు అనుగుణంగా ఉపయోగించడం ఎంతో అవసరమన్నారు. గాలి నాణ్యతను మెరుగుపరచడానికి నానో మెటీరియల్స్‌ను ఉపయోగించడం జరుగుతుందని చెప్పారు. నానో సెన్సార్ విభిన్న రంగాలలో కీలకపాత్రను పోషిస్తున్న విధానాన్ని వివరించారు. అదే సమయంలో నానో మెటీరియల్స్ ఉపయోగించి, వినియోగించే సమయంలో ఎదురయ్యే సవాళ్లు వాటిని పరిష్కరించాల్సిన బాధ్యతను గుర్తించాలని పేర్కొన్నారు. నూతన సాంకేతికతలను అభివృద్ధి చేసే సమయంలో ఏర్పడే వ్యర్థాల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో అవసరమని అన్నారు. వేస్ట్ డీ-కంపోజిషన్ ఏరియా ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికి సంబంధించిన చట్టాలను కఠినంగా అమలు చేయడం ఎంతో అవసరమని చెప్పారు. ఐఐసీటీ నుంచి డాక్టర్ గిరిబాబు, హెచ్‌పీసీఎల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ (బెంగళూరు) నుంచి శివకేశవరాజు, లూబ్రికేంట్ స్పెషలిస్ట్ అంజీవ్ జార్జ్, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వెంకటరావు, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నుంచి సురేష్‌బాబు విచ్చేసి నానో మెటీరియల్స్‌పై విశిష్ట ప్రసంగాలను అందించారు.

రక్తదానం చేయడం బాధ్యతగా గుర్తించాలి

» దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సిరిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ప్రమాదంలో ఉన్న ముగ్గురిని కాపాడవచ్చని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఎస్ఆర్ సేవ కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం సర్కిల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన సేకరణ చేపట్టారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి జ్యోతి ప్రజల్వనగావించారు. హెచ్‌డీఎఫ్‌సీ సమాజాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. బ్యాంకు సర్కిల్ హెడ్‌లు లంకా మణికంఠశర్మ, మంగిశెట్టి ప్రవీణ్, ఈ శిబిరం నుంచి సుమారు 100 యూనిట్లు రక్తాన్ని సేకరించినట్టుగా బ్యాంకు అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో వైనరసింహారాజు, వై.ఎన్.రాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



అంబలం పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల పాత డెయిరీ ఫారం సమీపంలోని ఇందిరానగర్‌లో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి మణికంఠ ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పను ప్రత్యేకంగా అలంకరించి అధిక సంఖ్యలో స్వాములు పాల్గొని పూజలు, భజనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన అన్నదాన కార్యక్రమం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : : కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో 41 రోజులపాటు జరిగిన అయ్యప్ప అన్నదానం కార్యక్రమం శుక్రవారం ముగిసింది. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాది మాలదారులుపాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామస్థులు, దాతలు, మహిళా సంఘం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్ర స్థాయి వింటర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ నిర్వహించనున్నట్టు సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.మోహన్ వెంకటరామ్ తెలిపారు. బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సు వేదికగా రెండు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి స్విమ్మర్లు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై, ఐఎం ఈవెంట్లలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్ గణబాబు, జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ వంటి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

పేదల అభ్యున్నతికి దారి చూపిన అంబేడ్కర్

» బాబాసాహెబ్‌కు ప్రముఖుల నివాళి


ప్రసంగిస్తున్న పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు



జనసేన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల


కస్తూరినగర్‌లో బాబాసాహెబ్ విగ్రహానికి మాలార్పణం

విశాఖపట్నం/మహారాణిపేట/డాబాగార్డెన్స్/అక్కయ్యపాలెం/సీతమ్మధార, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే అంబేడ్కర్ తపించారని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు కొనియాడారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించి ఆదర్శప్రాయుడయ్యారన్నారు. అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం శుక్రవారం కాన్వెంట్ జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోర్టు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, అన్ని విభాగాల అధిపతులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి డీఆర్‌వో భవానీ శంకర్ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఏవో ఈశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వైసీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు గణేష్‌కుమార్, వెంకటరామయ్య అదీప్‌రాజ్, ముఖ్య నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి వేరొక కార్యక్రమంలో మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు. కస్తూరినగర్-1లో అంబేడ్కర్ సేవా సంఘం అధ్యక్షుడు మారడపూడి ఆనంద్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి బడుగుల జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఆవాల నారాయణస్వామి, సంఘ సభ్యులు, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని భీమ్‌నగర్‌లో నివాళులర్పించిన కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. అంగన్వాడీ పిల్లలకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు. జనసేన నగర కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు శివప్రసాద్, కొల్లూరు రూపా, అమరారపు దుర్గ, నారా నాగేశ్వరరావు, కోనూరి శ్రీనివాసరావు, మర్రివేముల శ్రీనివాస్, కందుల రాజశేఖర్, గోపి, వీర మహిళలు పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరువీధి మహోత్సవం


వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు అలంకరణ

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యషష్ఠిని పురస్కరించుకుని డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలోని ఉపాలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ ఈవో జీవీ రమాభాయి సారథ్యంలో మంగళధ్వని, కోలాటం, వేదమంత్రాలతో తిరువీధి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలంకరించిన ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి అస్సాం గార్డెన్స్ ఆలయం నుంచి బయలుదేరి పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు. లక్ష్మీనరసింహ మహిళా బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

'సెవెన్ హిల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

అక్కయ్యపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు వై.రాజు కార్మిక శాఖాధికారులను కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆసుపత్రి యాజమాన్యం తొలగించిన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆసుపత్రి మానవ వనరుల విభాగం మేనేజర్ మహిళా కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని రాజు ఆరోపించారు. విధుల్లో ప్రమాదానికి గురై కాలు విరిగిన కార్మికుడికి కనీసం ప్రథమ చికిత్స కూడా అందించకపోవడం దుర్మార్గమన్నారు.

బడుల్లో నేడు తల్లిదండ్రులతో సమావేశాలు


ఆర్పీపేట పాఠశాలలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

కంచరపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆర్పీపేట, కంచరపాలెం, కప్పరాడ, కె.కాలనీ, బర్మాక్యాంపు, ఆశవానిపాలెం, తిక్కవానిపాలెం, కె.మర్రిపాలెం తదితర పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ప్రధానోపాధ్యాయులే విద్యార్థుల తల్లిదండ్రులకు స్వయంగా ఫోన్ చేసి సమావేశాలకు ఆహ్వానించారు. పాఠశాలల్లో మెరుగైన విద్యనందించడానికి తల్లిదండ్రుల సలహాలు స్వీకరించి అమలు చేయడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని గోపాలపట్నం ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్ పేర్కొన్నారు. సమావేశాల్లో విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులు (ప్రోగ్రెస్) అందజేస్తారు. ఈ సమావేశాలకు ఏర్పాటు పూర్తిచేయడంతో జీవీఎంసీ, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు నూతన శోభను సంతరించుకున్నాయి.

11న గీతా జయంతి ఉత్సవాలు

మహారాణిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న గీతా జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ సాగర్‌నగర్ అధ్యక్షుడు సాంబదాస్ తెలిపారు. శుక్రవారం మహారాణిపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో లక్ష గీతాదాన మహాయజ్ఞం, సంపూర్ణ గీతా పారాయణం జరుపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిదండి చిన జీయర్ స్వామి, అంతర్జాతీయ ఇస్కాన్ చైర్మన్ గురుప్రసాద్ స్వామి మహారాజ్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక గీతా పారాయణం, అనంతరం చినజీయర్ స్వామి, గురుప్రసాద్ స్వామిల అనుగ్రహ భాషణం, అనంతరం దాతలకు సత్కారం, భగవద్గీత పుస్తకాల వితరణ జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నితాయి సేవినీ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.


గీతాపారాయణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

భూముల పరిరక్షణకే రెవెన్యూ సదస్సులు

» ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార/మహారాణిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో భూకబ్జాలు, దౌర్జన్యాలు జరిగాయని, కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేస్తూ, వారి భూముల పరిరక్షణకు వీలుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెనపువానిపాలెం రెవెన్యూ సదస్సులో 13 మంది తమ సమస్యలు తెలుపుతూ దరఖాస్తులు చేసుకున్నారు. తహసీల్దార్ రమేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విచ్చేసి మాట్లాడారు. తనకు కూడా సీతమ్మధార ప్రాంతంలో కొన్ని ఫిర్యాదులు అందాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సదస్సులో 13 మంది తమ సమస్యలు తెలుపుతూ దరఖాస్తులు సమర్పించారని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ రమేష్ తెలిపారు. భూకబ్జాకు సంబంధించి 2, క్రమబద్ధీకరణ కోరుతూ 1, ఆక్రమణపై 1, యూఎల్‌సీకి 4, ఇతర అంశాలకు సంబంధించి మరో 4 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, రెవెన్యూ సిబ్బంది, టీడీపీ వార్డు అధ్యక్షులు బర్ల పద్మలత, కిశోర్ పాల్గొన్నారు. మహారాణిపేట పరిధిలోని చందక వీధిలో జరిగిన సదస్సులో మొత్తం 20 వినతులు స్వీకరించారు. వీటిలో 1 పింఛన్, 7 ఆదాయ పన్ను ధ్రువీకరణ పత్రాలు, 12 కుల ధ్రువీకరణ పత్రాలు కోరుతూ దరఖాస్తు చేశారు. భూ సమస్యలపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అధికారులు తెలిపారు. ఎంఆర్‌వో జిలానీ, ఆర్ఐ ఉమాదేవి, వీఆర్‌వో ఎం.అప్పల నాయుడు, సాయిలక్ష్మి, రెవెన్యూ, దేవాదాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

కప్పరాడలో వైద్య వసతులకు వినతి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కప్పరాడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య వసతులు కల్పించాలని కార్పొరేటర్ గంకల కవిత శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు,బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు,జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో గంకల కవిత మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. అరకొర మందులు, సదుపాయాల లేమితో రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు చేశారు. వైద్యులను నియమించి, రోగుల రక్తపరీక్షలకు సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గంకల అప్పారావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచరూ!

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టైమ్ స్కేల్ ఉద్యోగులుగా వివిధ హోదాల్లో ఏళ్లతరబడి పనిచేస్తున్నవారి ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని ఆంధ్రా యూనివర్సిటీ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. నగర పర్యటనకు వచ్చిన సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


జగద 2 : కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

జగదాంబ కూడలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు జరిగాయి. పంచామృతాభిషేకం, లక్ష్మీహోమం, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యాపారాయణ, పూర్ణాహుతి నిర్వహించారు, క్షీరాభిషేక సేవలను అర్చకులు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దర్శనాల్లో ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

కులశేఖర్ లేనిలోటు తీరనిది'


కులశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

సీతంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలో జన్మించి నగరంలోని బీవీకే కళాశాలలో డిగ్రీ చదివి, చిత్రం సినిమా ద్వారా సినిమా గీత రచయితగా పేరు పొందిన ప్రముఖ గాయకుడు, ప్రప్రథమ మనస్వినీ అవార్డు గ్రహీత కులశేఖర్ 53 ఏళ్ల వయసులో మరణించడం తెలుగు సినీ పరిశ్రమకు తీరనీ లోటని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో కులశేఖర్ సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కులశేఖర్ గురువు వై.సత్యారావు, సహవిద్యార్థి, రచయిత లోగిస లక్ష్మీనాయుడు, డాక్టర్ బాబ్జీ, హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, నరసింహారావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్ నివారణకు వ్యాక్సిన్


బాలికకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ షిరీన్, చిత్రంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తదితరులు

జగదాంబ కూడలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ కేన్సర్ బారిన పడకుండా బాలికలకు వ్యాక్సిన్ ఉపకరిస్తుందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద పేర్కొన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా శుక్రవారం కోటవీధి మత్స్యకార సామాజిక భవనంలో వ్యాక్సిన్ వేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో గర్భాశయ కేన్సర్ ప్రమాదం ఉండదన్నారు. ఆరు నెలల తర్వాత మరో డోసు వేసుకోవాల్సి ఉంటుందన్నారు. చైతన్య స్రవంతి సేవా సంస్థను ఆయన అభినందించారు. సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబ బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. జర్నలిస్టు సంఘం ప్రతినిధులు పి.నారాయణ, గంట్ల శ్రీనుబాబు, సీరం ఇనిస్టిట్యూట్ మేనేజర్ రాంరతన్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చర్యలపై సమీక్ష


అధికారులతో సమావేశమైన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం

అక్కయ్యపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యవస్థ నిర్మూలనలో జిల్లా కార్మిక శాఖాధికారులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న చర్యలపై ఆరా తీసేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం, ఆదిలక్ష్మి తిపర్లు శుక్రవారం అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయానికి వచ్చారు. కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.సునీత అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. గత రెండేళ్లలో జిల్లాలో, నగరంలో గుర్తించిన బాల కార్మికులపై ఆరా తీశారు. హోటళ్ళు, ఇటుక బట్టీలు, ఇంటి పనులు, కార్ఖానాలు, ఇతర రంగాల్లో వారిని ఎక్కడెక్కడ గుర్తించారు? యజమానులపై ఎన్ని కేసులు నమోదు చేశారో వివరాలు అడిగారు. బాధ్యులకు పడిన శిక్షలు, తప్పించుకుంటున్న వారి శాతం వంటి వివరాలను నిశితంగా రాబట్టారు. అపరాధ రుసుములు బ్యాంకుల్లో జమ చేస్తున్నారా? అన్న విషయం పరిశీలించారు. బాల కార్మికులుగా గుర్తించిన పిల్లల భవిష్యత్‌కు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు. వారికి విద్యాబోధనలో జిల్లా విద్యాశాఖాధికారులు అందిస్తున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్లు జి.రాజు, ఆర్.రమాదేవి, ఎస్.గోవింద్, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి లక్ష్మి, ఐసీపీయూ ప్రతినిధులు మమత, ఆనంద్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ



విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి, అంతర్జాతీయ బ్లూ బ్యాడ్జి అంపైర్ ప్యానల్ హోల్డర్ డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి బెంగళూరులో జరిగే జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీకి సీనియర్ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఎల్ఐసీ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబరుగా, టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న శర్మ...జాతీయ టోర్నీకి అంపైర్‌గా నియమితులు కావడంపై ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్, ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఎం.కామేశ్వరి, కార్యదర్శి జి.వరప్రసాద్, సంఘం ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

రైల్వే సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్



సివిల్ డిఫెన్స్ సిబ్బందితో సంభాషిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పౌర రక్షణ దినోత్సవం సందర్భంగా వాల్తేరు రైల్వే సివిల్ డిఫెన్స్ శాఖ శుక్రవారం డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని సివిల్ డిఫెన్స్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్తు సమయంలో స్టేషన్‌లో చిక్కుకున్నవారిని రక్షించడం, అగ్ని ప్రమాదాల నుంచి కాపాడడం, ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాలపై మాక్ డ్రిల్ ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో అధికారులు, సివిల్ డిఫెన్స్ వలంటీర్లు, ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు మాట్లాడుతూ సమాజ సేవలో సివిల్ డిఫెన్స్ కీలక బాధ్యతలు నిర్వహిస్తుందని, గుంపు నియంత్రణ చర్యలతోపాటు ప్రమాద, విపత్తు సమయాల్లో సహాయక చర్యలలో ముందుండి ప్రజలను కాపాడడంలో విశేష పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వై.రెడ్డి, ఇతర సిబ్బంది డ్రిల్ నిర్వహించారు. ఏడీఆర్ఎం ఇ.శాంతారామ్, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్, సివిల్ డిఫెన్స్ ఆఫీసర్ సిద్దార్థ ప్రధాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

... 7వ పేజీ తరువాయి

ముందుండేలా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. తనపై విశాఖ ప్రజలు ఎంతో నమ్మకాన్ని ఉంచి ఆదరించారన్నారు. ఇక్కడి ప్రజలు ఎంతో మంచివాళ్లని, టీడీపీపై ఎంతో అభిమానాన్ని కలిగి ఉన్నారన్నారు. విశాఖ వాసులు కమిటెడ్‌గా ఉంటారన్నారు. తాను ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలను చూశానని, ఇటువంటి భిన్నమైన నగరాన్ని ఎక్కడా చూడలేదన్నారు. మంచి, చెడులను గమనించి నిర్ణయాలు తీసుకోవడంలో ఇక్కడి ప్రజలు ముందుంటారన్నారు. ఒకప్పుడు ఐటీని ప్రమోట్ చేశామని, ఇప్పుడు డీప్ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నామన్నారు. విశాఖలో అనేక కీలక సంస్థలు తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయన్నారు.

ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

... 7వ పేజీ తరువాయి

తమను (చంద్రబాబు) అడ్డుకున్న వైసీపీ నేతలపై చర్యలు విషయంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని టీడీపీ పీఆర్వో కె.గోపాలరెడ్డి ఫిర్యాదు చేశారు. వైసీపీ కీలక వ్యక్తులను ఉద్దేశపూర్వకంగా అప్పటి పోలీసులు తప్పించి, సామాన్య కార్యకర్తల పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వైసీపీ నాయకుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చి, చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పాఠశాలల్లో పండుగ

... 7వ పేజీ తరువాయి

ఒకటి నుంచి పదో తరగతి వరకు 77,165 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 72,918 మంది పాఠశాలల్లో భోజనం చేస్తున్నారు. మరో 60 వేల మందికి భోజనం సిద్ధం చేస్తున్నారు. మెనూ ప్రకారం అన్నం, పప్పుచారు, కూర, స్వీట్ పొంగలి, శనగపప్పు చిక్కీ అందిస్తారు. ఉదయం తల్లులకు రాగి జావ అందజేస్తారు. నగరంతోపాటు, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో భోజనం సరఫరా చేసే అక్షయపాత్ర ఏజెన్సీ ఒక్కటే 75 వేల మందికి ఆహారం సిద్ధం చేస్తోంది. జిల్లాలో పేరెంట్, టీచర్ మీటింగ్‌కు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనేందుకు 25 పాఠశాలలను ఎంపిక చేశారు. శనివారం నిర్వహించనున్న సమావేశాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

నేడు ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

... 7వ పేజీ తరువాయి

కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ స్నాక్స్ పంపిణీ, గుర్తింపు కార్డులు పరిశీలించి లోపలకు పంపించేందుకు సీనియర్ ఫ్యాకల్టీ 30 మందితో పది కమిటీలను ఏర్పాటు చేశారు.

అతిథులు...

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ, విశిష్ట అతిథిగా విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గ్రంధి మల్లికార్జునరావు, చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావుతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకానున్నారు.

ఇదీ షెడ్యూల్..

బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 5.30 గంటలకు అతిథుల ప్రసంగాలు ప్రారంభమవుతాయి. ఇవి రెండు గంటలు కొనసాగుతాయి. రాత్రి 8 గంటలకు వేడుకలు ముగియనున్నాయి.

ఏయూ వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ ఏర్పాటయ్యేదెన్నడో!?

... 7వ పేజీ తరువాయి

సంబంధించి ఉన్నత విద్యా శాఖ నుంచి వర్సిటీ అధికారులకు సమాచారం రాకపోవడంతో ఏయూ నుంచి నామినీ పేరును ఖరారు చేయడం సాధ్యం కాలేదు. దీంతో ఇప్పటివరకూ సెర్చ్ కమిటీ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు.

ఆశావహుల్లో ఉత్కంఠ

ఏయూ పూర్తిస్థాయి వైస్ చాన్సలర్‌గా వచ్చేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. ఈ జాబితాలో సుమారు పది మంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరంతా తమ స్థాయిల్లో ప్రయత్నాలను సాగిస్తున్నారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు ఎంపీ ఎం.శ్రీభరత్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పొరుగు జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుల ద్వారా కొందరు సీనియర్ ప్రొఫెసర్లు తమ ప్రయత్నాలను సాగిస్తున్నారు. మరికొందరు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నగర పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎవరికి అవకాశాన్ని కల్పిస్తుందో చూడాలి. ఏదిఏమైనా సెర్చ్ కమిటీ ఏర్పాటైతేనే గానీ వీసీ ఎంపిక ప్రక్రియ ముందుకుసాగదు.

సంక్షిప్తంగా..

బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో జరుగుతున్న డీఎస్సీ ఎస్జీటీ కోసం జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని బీసీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు వంటివి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విజయం సాధించడానికి నిరంతరం సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

అభివృద్ధికి మూలం హిందీ భాష

» డాక్టర్ శివమ్ తివారీ



శివమ్ తివారీని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హిందీ భాష మన అభివృద్ధికి మూలమని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అవధీ సాహిత్య సంస్థాన్ కార్యదర్శి డాక్టర్ శివమ్ తివారీ అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాయత్రీ విద్యా పరిషత్‌లో 'హిందీ భాష ద్వారా సరికొత్త అవకాశాలు-ఉపాధి' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త విచ్చేసిన డాక్టర్ శివమ్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. హిందీ ప్రాశస్త్యం వివరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య బోస్, యూజీ కోర్సుల డైరెక్టర్ గిరిధర్, డాక్టర్ అనిత, డాక్టర్ రమణి, పీఆర్వో శేష పద్మ, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ శాస్త్రి, శ్రీనివాసన్, డాక్టర్ ఇలాహి షేక్ పాల్గొన్నారు.

డా.అబ్దుల్‌ఖాన్‌కు శ్రీవాస్తవ అవార్డు



ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్థోపెడిక్ విభాగంలో జాతీయ స్థాయిలో శ్రీవాస్తవ మెడల్ అవార్డుకు అపోలో ఆస్పత్రికి చెందిన డాక్టర్ అబ్దుల్‌ఖాన్ ఎంపికయ్యారు. బెంగళూరులో ఈ నెలలో జరగనున్న ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వార్షిక అవార్డును అందుకోనున్నట్టు ఆయన తెలిపారు. ఆయన రాసిన ఆర్థరైటీస్, రుమటైటీస్ ఆర్థరైటీస్, మోకాల్ల మార్పిడికి సంబంధించిన శాస్త్రీయ కథనాలను పరిశీలించి ఈ అవార్డు ప్రకటించినట్టు అవార్డు కమిటీ పేర్కొంది.

సినిమా గైడ్

● **పుష్ప-2 :** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 46, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 28, క్యారెట్ 64 దొండకాయలు 32, బంగాళ దుంపలు 38, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 50, బరబాటి 28, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 32 దోస కాయలు 20, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండ ఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	85
ఫారం ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	290

రోడ్డు అంతా 'వ్యర్థమే'!

» డెబ్రిస్ కుప్పలతో నిండిపోయిన ముడసర్లోవ ఎగువ భాగం రహదారి
» లారీలతో తెచ్చి పడేస్తున్నా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
» ఈ మార్గంలో వాహనాలు తిరగలేని పరిస్థితి



రోడ్డుకు సగం వరకూ నిండిపోయిన డెబ్రిస్

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని ముడసర్లోవ ఎగువ భాగంలో గల రోడ్డంతా డెబ్రిస్‌తో నిండిపోయింది. వ్యర్థాల కుప్పలు పెరిగిపోతున్నా జీవీఎంసీ అధికారులు మాత్రం వాటి తొలగింపునకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవీఎంసీ నిధులు రూ.12 కోట్లతో ఈ రోడ్డు వేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిండా డెబ్రిస్ కుప్పలతో నిండిపోయింది. రోడ్డు పొడవునా రెండు వైపులా చెత్తాచెదారం కుప్పలు ఉన్నాయి. ఇవి రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రోడ్డు ఉంది కదా అనే ఉద్దేశంతో ఇక్కడ స్థానికులు అనేక వ్యర్థాలను తెచ్చి పడేస్తున్నారు. ప్రస్తుతం ఈ రహదారి పరిస్థితి చూస్తే రాకపోకలకు కంటే వ్యర్థాలను వేయడానికే అధికంగా ఉపయోగిస్తున్నారనే సందేహం కలుగుతుంది.

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇక్కడ ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారు. లారీలతో ఇసుక తెచ్చి రోడ్డు చివరి భాగంలో డంపింగ్ చేసేవారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఇక్కడ ఇసుక రీచ్‌లను ఎత్తేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డు నిర్వహణపై జీవీఎంసీ కూడా దృష్టి సారించడం లేదు. దీంతో నిర్మాణ వ్యర్థాలు వేసేందుకు స్థానికులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కొందరు లారీలతో చెత్తను తీసుకొచ్చి ఇక్కడ డంపింగ్ చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



రోడ్డు పొడవునా వ్యర్థాల కుప్పలు

ప్రస్తుతం రైల్వే జోనల్ కార్యాలయం నిర్మాణానికి ఈ ప్రాంతంలోని 26వ సర్వే నంబర్‌లో గల 52 ఎకరాలను కేటాయించారు. ఆ పనులు చేపట్టేందుకు కూడా ఈ మార్గాన్నే ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే డెబ్రిస్ కుప్పలు ఉండడంతో ఆ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. పదేళ్ల కిందట ఈ రోడ్డు ఇదే విధంగా వ్యర్థాల కుప్పలతో నిండి ఉండేది. జీవీఎంసీ అధికారులు స్పందించి వాటిని తొలగించారు. పెద్ద వాహనాలు వెళ్లకుండా గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ కాపలా ఏర్పాటు చేసి ఎవరైనా డెబ్రిస్ తెచ్చి వేస్తే జరిమానా విధించేవారు. దీంతో కొన్నాళ్లు ఇక్కడకు డెబ్రిస్ వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు అక్కడ ఎలాంటి కాపలా లేదు, గడ్డర్లను కూడా ఎవరో తొలగించారు. దీంతో డెబ్రిస్ పారబోసేందుకు ఎలాంటి అడ్డులేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఈ రోడ్డుపై ఉన్న డ్రెబిస్ కుప్పలను తొలగించడమే కాకుండా ఎవరూ చెత్తను పారబోయకుండా చర్యలు తీసుకోవాల్సిలని స్థానికులు కోరుతున్నారు.

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

వర్ధంతి సందర్భంగా పలు చోట్ల ఘన నివాళి



జీవీఎంసీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్, ఇతర అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభ్యుదాయానికి ఎంతో కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో డాక్టర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.

అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఏయూలో ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి అర్పించారు. ఏయూ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వీసీ జి.శశిభూషణరావు పూలమాలల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దార్శనికత, సమగ్రత కలిగిన అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను నేటితరం యువత ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల పెదగదిలి జంక్షన్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పలువురు



ఆరిలోవలో అంబేడ్కర్‌కు టీడీపీ నేతల నివాళి



ఏయూలో అంబేడ్కర్‌క నివాళులు అర్పిస్తున్న వీసీ శశిభూషణరావు తదితరులు

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ మేధస్సు భారతదేశానికి ఎంతో ఉపయోగపడిందన్నారు. ఆయన ఆశయాలు ఏనాటికీ స్ఫూర్తిదాయకమన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ వెలుగు దివిటీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యదర్శి ఒమ్మి పోలారావు, టీడీపీ నేతలు యల్లమల్లి సురేష్, మజ్జి రమణి, బలగ సుధాకర్, కొండమ్మ, రేఖాజ్యోతి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభం రేపు

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌కు సమీపంలోని విమ్స్ ప్రాంగణంలో నిర్మాణం జరుగుతున్న ఆరిలోవ పోలీసుస్టేషన్ పనులను శుక్రవారం ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పరిశీలించారు. ఈ పోలీసుస్టేషన్‌ను ఆదివారం 11 గంటలకు ప్రారంభించనున్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించనున్నారు. దీంతో ఎట్టకేలకు ఆరిలోవ పోలీసుస్టేషన్ కల నెరవేరనున్నది.

ఇప్పటి వరకూ ఇక్కడ పోలీసుస్టేషన్ చిన్న భవనంలో ఉంది. ఇరుకైన గదులు ఉండేవి. దీంతో ఏదో సర్దుకొని వెళ్లడం తప్ప సిబ్బందికి వేరే ప్రత్యామ్నాయం ఉండేది కాదు. ఫిర్యాదులు చేయడానికి వచ్చే వారు సైతం చాలా ఇబ్బందులు పడేవారు. కూర్చోవడానికి వసతులు కూడా లేని



నూతన భవనాన్నిపరిశీలిస్తున్నఏసీపీ నరసింహమూర్తి



ప్రారంభానికి సిద్ధమైన పోలీసుస్టేషన్ భవనం

పరిస్థితి. మహిళా పోలీసు సిబ్బంది ఇబ్బందులైతే వర్ణనాతీతంగా ఉండేవి. ఇప్పుడు కొత్త పోలీసు స్టేషన్ భవనం అందుబాటులోకి వస్తుండడంతో తమ బాధలు తీరాయని స్టేషన్ సిబ్బంది సంబర పడుతున్నారు.

ఒక ఎకరా స్థలంలో సుమారు రూ.2.75 కోట్ల వ్యయంతో 17 గదులతో ఈ పోలీసుస్టేషన్ భవనం రూపుదిద్దారు. మొదటి అంతస్తు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2019లో అప్పటి రాష్ట్ర హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికలు రాగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణ పనులు పెద్దగా జరగలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో వెంటనే నిధులు విడుదల చేసి పనులు చకచకా పూర్తి చేశారు. అవసరమైన ఫర్నిచర్ కూడా సమకూర్చారు. దీంతో నూతన పోలీసుస్టేషన్ ఆదివారం నుంచి అందుబాటులోకి వస్తుండడంతో ఇక్కడి పోలీసు సిబ్బంది, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత



మౌనికకు సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యానికి గురైన చిన్నారి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు. చిన్నారి ఎస్.మౌనిక అనారోగ్యం కారణంగా బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం అందించారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను మౌనికకు ఎమ్మెల్యే అందజేశారు.

అలరించిన నాటక ప్రదర్శనలు

మద్దిలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'రాయి', 'బంధనం' నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గెద్ద వరప్రసాద్ దర్శకత్వంలో రెండు నాటకాల్లో కళాకారులు తమ అద్భుత నటనతో ప్రేక్షకులను మెప్పించారు.

సమాజంలో పేదవారిని దోచుకుంటున్న బలవంతులు, ధనవంతులపై పేదవారు తిరగబడితే ఏవిధంగా ఉంటుందో 'రాయి' నాటకంలో కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో ప్రేమతో పెంచి ప్రయోజకులను చేస్తారు. పిల్లలు ప్రయోజకులయ్యాక అప్పటికే వృద్ధులైన తల్లిదండ్రులను ఎంత దారుణంగా చూస్తున్నారో 'బంధనం' నాటిక ద్వారా తెలియజేశారు.

ఈ సందర్భంగా దివంగత బాదంగీర్ సాయి సంతాప సభ ఏర్పాటు చేశారు. అకాడమీ నిర్వహకులు సాయి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి ఫైడా కృష్ణప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.



నాటకంలోని ఓ రసవత్తర సన్నివేశం

వింటర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు ఏయూ విద్యార్థి ప్రేమ్‌కుమార్ ఎంపిక

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ నిర్వహించే వింటర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం-2024కు ఏయూ విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం మొదటి సంవత్సరం విద్యార్థి వన్నల ప్రేమ్‌కుమార్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు శుక్రవారం ఆయన కార్యాలయంలో ప్రేమ్‌కుమార్‌ను అభినందించి ఇంటర్న్‌షిప్ ఉత్తర్వులను అందించారు. రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయ్‌రావు విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి పి.ప్రేమానందం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం ఒకే విద్యార్థి ఈ జాతీయ స్థాయి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు ఎంపిక కావడం అది కూడా తమ విభాగానికి చెందిన విద్యార్థి ప్రేమ్‌కుమార్ కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 16నుంచి 2025, జనవరి 10వ తేదీ వరకు ఢిల్లీలో ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనేత అంబేడ్కర్

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఘన నివాళి

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆదర్శనీయుడని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వైసత్యకుమార్ శ్లాఘించారు. ఆయనకు మాత్రమే జయంతి, వర్ధంతులు ప్రభుత్వపరంగా నిర్వహించడానికి దేశానికి చేసిన ఎనలేని సేవ కారణమన్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల కాలంలో ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన స్ఫూర్తితో పనిచేస్తున్నామన్నారు. అంబేడ్కర్ జన్మించి, నడయాడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ, ఆయన అందించిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని, ఫలాలను ప్రజలకు అందించే కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, లక్ష్మీనారాయణ, సుహాసిని, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సీతంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెం బస్టాప్ వద్ద చెత్త కాగితాలు ఏరుకుంటూ వాటిని అమ్ముకొని జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు నాలుగో పట్టణ పోలీసులు వివరాలు నమోదు చేసుకుని, అతడు ఎవరన్నది ఆరా తీస్తున్నారు. అతడి వయసు 45-50 ఏళ్లుంటాయని, మోహన్ అని పిలుస్తుంటారని తెలిసింది. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారని, వివరాలు తెలిసిన వారు 94407 06012 ఫోను నెంబర్‌కి లేదా తమకు తెలియజేయాలని నాలుగో పట్టణ పోలీసులు కోరారు.

8న బ్రాహ్మణ కులస్థుల ఆత్మీయ కలయిక

ఆటోనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న పెదగంట్యాడ ఆటోనగర్ గంగవరం రహదారిలో విశాఖ బ్రాహ్మణ కులస్థుల ఆత్మీయ కలయిక, వన సమారాధన నిర్వహిస్తున్నట్టు బ్రాహ్మణ కులసంఘం సెక్రటరీ నాగేంద్ర పరిమి, ఐలా కమిటీ సభ్యులు చుండూరు విశాలాక్షి తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఎంఎస్ఎంఈ, ఎస్ఆర్‌సీ, డీఐసీ, ఎస్‌సీఐసీ బ్యాంకులు, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలు పాల్గొంటాయన్నారు. అక్కడ వివిధ కంపెనీల ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు నూతన వ్యాపార అవకాశాలపై అవగాహనను కల్పిస్తాయన్నారు. బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో లక్ష్మి, శర్మ, బీజేపీ మూర్తి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నానో మెటీరియల్స్‌తో బహుళ ప్రయోజనాలు

గ్లోబల్‌క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ విభాగాధిపతి దేవా పురాణం



డాక్టర్ హెచ్ పురాణంను సన్మానిస్తున్న నిర్వాహకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నానో మెటీరియల్స్ బహుళ ప్రయోజనాలను కలిగి ఉన్నాయని అమెరికాలోని వైరటీస్ సంస్థ, గ్లోబల్ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ విభాగాధిపతి డాక్టర్ దేవా హెచ్ పురాణం అన్నారు. ఏయూ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ సదస్సు నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ కెటాలసిస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎనర్జీ, కెటాలసిస్, ఎన్విరాన్మెంట్ రంగాలలో నానో మెటీరియల్స్‌ను ఉపయోగించే విధానాలు, వాటి ఉపయోగాలను విద్యార్థులు, పరిశోధకులకు వివరించారు. విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని అన్వయించడం, వర్తమాన అవసరాలు అనుగుణంగా ఉపయోగించడం ఎంతో అవసరమన్నారు. గాలి నాణ్యతను మెరుగుపరచడానికి నానో మెటీరియల్స్‌ను ఉపయోగించడం జరుగుతుందని చెప్పారు. నానో సెన్సార్ విభిన్న రంగాలలో కీలకపాత్రను పోషిస్తున్న విధానాన్ని వివరించారు. అదే సమయంలో నానో మెటీరియల్స్ ఉపయోగించి, వినియోగించే సమయంలో ఎదురయ్యే సవాళ్లు వాటిని పరిష్కరించాల్సిన బాధ్యతను గుర్తించాలని పేర్కొన్నారు. నూతన సాంకేతికతలను అభివృద్ధి చేసే సమయంలో ఏర్పడే వ్యర్థాల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో అవసరమని అన్నారు. వేస్ట్ డీ-కంపోజిషన్ ఏరియా ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికి సంబంధించిన చట్టాలను కఠినంగా అమలు చేయడం ఎంతో అవసరమని చెప్పారు. ఐఐసీటీ నుంచి డాక్టర్ గిరిబాబు, హెచ్‌పీసీఎల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ (బెంగళూరు) నుంచి శివకేశవరాజు, ల్యూబ్రికేంట్ స్పెషలిస్ట్ అంజీవ్ జార్జ్, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వెంకటరావు, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నుంచి సురేష్‌బాబు విచ్చేసి నానో మెటీరియల్స్‌పై విశిష్ట ప్రసంగాలను అందించారు.

రక్తదానం చేయడం బాధ్యతగా గుర్తించాలి

» దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సిరిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ప్రమాదంలో ఉన్న ముగ్గురిని కాపాడవచ్చని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఎస్సార్ సేవ కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం సర్కిల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన సేకరణ చేపట్టారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి జ్యోతి ప్రజల్వనగావించారు. హెచ్‌డీఎఫ్‌సీ సమాజాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. బ్యాంకు సర్కిల్ హెడ్‌లు లంకా మణికంఠశర్మ, మంగిశెట్టి ప్రవీణ్, ఈ శిబిరం నుంచి సుమారు 100 యూనిట్లు రక్తాన్ని సేకరించినట్టుగా బ్యాంకు అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో వై.నరసింహారాజు, వై.ఎస్.రాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



అంబలం పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఆరిలోవ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల పాత డెయిరీ ఫారం సమీపంలోని ఇందిరానగర్‌లో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి మణికంఠ ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పను ప్రత్యేకంగా అలంకరించి అధిక సంఖ్యలో స్వాములు పాల్గొని పూజలు, భజనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన అన్నదాన కార్యక్రమం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : : కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో 41 రోజులపాటు జరిగిన అయ్యప్ప అన్నదానం కార్యక్రమం శుక్రవారం ముగిసింది. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాది మాలదారులుపాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామస్థులు, దాతలు, మహిళా సంఘం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్ర స్థాయి వింటర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ నిర్వహించనున్నట్టు సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.మోహన్ వెంకటరామ్ తెలిపారు. బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సు వేదికగా రెండు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి స్విమ్మర్లు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై, ఐఎం ఈవెంట్లలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్ గణబాబు, జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ వంటి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

పేదల అభ్యున్నతికి దారి చూపిన అంబేడ్కర్

▸ బాబాసాహెబ్‌కు ప్రముఖుల నివాళి


ప్రసంగిస్తున్న పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు


జనసేన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల


కస్తూరినగర్‌లో బాబాసాహెబ్ విగ్రహానికి మాలార్పణం

విశాఖపట్నం/మహారాణిపేట/డాబాగార్డెన్స్/అక్కయ్యపాలెం/సీతమ్మధార, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే అంబేడ్కర్ తపించారని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు కొనియాడారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించి ఆదర్శప్రాయుడయ్యారన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం శుక్రవారం కాన్వెంట్ జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోర్టు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, అన్ని విభాగాల అధిపతులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి డీఆర్వో భవానీ శంకర్ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఏవో ఈశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వైసీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు గణేష్‌కుమార్, వెంకట రామయ్య అదీప్‌రాజ్, ముఖ్య నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి వేరొక కార్యక్రమంలో మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోందని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు. కస్తూరినగర్-1లో అంబేడ్కర్ సేవా సంఘం అధ్యక్షుడు మారడపూడి ఆనంద్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి బడుగుల జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఆవాల నారాయణస్వామి, సంఘ సభ్యులు, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని భీమ్‌నగర్‌లో నివాళులర్పించిన కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. అంగన్వాడీ పిల్లలకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, ఇప్టా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు. జనసేన నగర కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు శివప్రసాద్, కొల్లూరు రూపా, అమరారపు దుర్గ, నారా నాగేశ్వరరావు, కోనూరి శ్రీనివాసరావు, మర్రివేముల శ్రీనివాస్, కందుల రాజశేఖర్, గోపి, వీర మహిళలు పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరువీధి మహోత్సవం


వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు అలంకరణ

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యషష్ఠిని పురస్కరించుకుని డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలోని ఉపాలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ ఈవో జీవీ రమాభాయి సారథ్యంలో మంగళధ్వని, కోలాటం, వేదమంత్రాలతో తిరువీధి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలంకరించిన ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి అస్సాం గార్డెన్స్ ఆలయం నుంచి బయలుదేరి పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు. లక్ష్మీనరసింహ మహిళా బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

'సెవెన్ హిల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

అక్కయ్యపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు వై.రాజు కార్మిక శాఖాధికారులను కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆసుపత్రి యాజమాన్యం తొలగించిన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆసుపత్రి మానవ వనరుల విభాగం మేనేజర్ మహిళా కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని రాజు ఆరోపించారు. విధుల్లో ప్రమాదానికి గురై కాలు విరిగిన కార్మికుడికి కనీసం ప్రథమ చికిత్స కూడా అందించకపోవడం దుర్మార్గమన్నారు.

బడుల్లో నేడు తల్లిదండ్రులతో సమావేశాలు


ఆర్పీపేట పాఠశాలలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

కంచరపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆర్పీపేట, కంచరపాలెం, కప్పరాడ, కె.కాలనీ, బర్మాక్యాంపు, ఆశవానిపాలెం, తిక్కవానిపాలెం, కె.మర్రిపాలెం తదితర పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ప్రధానోపాధ్యాయులే విద్యార్థుల తల్లిదండ్రులకు స్వయంగా ఫోన్ చేసి సమావేశాలకు ఆహ్వానించారు. పాఠశాలల్లో మెరుగైన విద్యనందించడానికి తల్లిదండ్రుల సలహాలు స్వీకరించి అమలు చేయడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని గోపాలపట్నం ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్ పేర్కొన్నారు. సమావేశాల్లో విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులు (ప్రోగ్రెస్) అందజేస్తారు. ఈ సమావేశాలకు ఏర్పాటు పూర్తిచేయడంతో జీవీఎంసీ, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు నూతన శోభను సంతరించుకున్నాయి.

11న గీతా జయంతి ఉత్సవాలు

మహారాణిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న గీతా జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ సాగర్‌నగర్ అధ్యక్షుడు సాంబదాస్ తెలిపారు. శుక్రవారం మహారాణిపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో లక్ష గీతాదాన మహాయజ్ఞం, సంపూర్ణ గీతా పారాయణం జరుపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిదండి చిన జీయర్ స్వామి, అంతర్జాతీయ ఇస్కాన్ చైర్మన్ గురుప్రసాద్ స్వామి మహారాజ్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక గీతా పారాయణం, అనంతరం చినజీయర్ స్వామి, గురుప్రసాద్ స్వామిల అనుగ్రహ భాషణం, అనంతరం దాతలకు సత్కారం, భగవద్గీత పుస్తకాల వితరణ జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నితాయి సేవినీ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.


గీతాపారాయణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



సింహాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్ర నామాలతో సంకల్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

భూముల పరిరక్షణకే రెవెన్యూ సదస్సులు

▸ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార/మహారాణిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో భూకబ్జాలు, దౌర్జన్యాలు జరిగాయని, కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేస్తూ, వారి భూముల పరిరక్షణకు వీలుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెసపువానిపాలెం రెవెన్యూ సదస్సులో 13 మంది తమ సమస్యలు తెలుపుతూ దరఖాస్తులు చేసుకున్నారు. తహసీల్దార్ రమేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు విచ్చేసి మాట్లాడారు. తనకు కూడా సీతమ్మధార ప్రాంతంలో కొన్ని ఫిర్యాదులు అందాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సదస్సులో 13 మంది తమ సమస్యలు తెలుపుతూ దరఖాస్తులు సమర్పించారని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ రమేష్ తెలిపారు. భూకబ్జాకు సంబంధించి 2, క్రమబద్ధీకరణ కోరుతూ 1, ఆక్రమణపై 1, యూఎల్‌సీకి 4, ఇతర అంశాలకు సంబంధించి మరో 4 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, రెవెన్యూ సిబ్బంది, టీడీపీ వార్డు అధ్యక్షులు బర్ల పద్మలత, కిశోర్ పాల్గొన్నారు. మహారాణిపేట పరిధిలోని చందక వీధిలో జరిగిన సదస్సులో మొత్తం 20 వినతులు స్వీకరించారు. వీటిలో 1 పింఛన్, 7 ఆదాయ పన్ను ధ్రువీకరణ పత్రాలు, 12 కుల ధ్రువీకరణ పత్రాలు కోరుతూ దరఖాస్తు చేశారు. భూ సమస్యలపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అధికారులు తెలిపారు. ఎంఆర్వో జిలాని, ఆర్ఐ ఉమాదేవి, వీఆర్వో ఎం.అప్పల నాయుడు, సాయిలక్ష్మి, రెవెన్యూ, దేవాదాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

కప్పరాడలో వైద్య వసతులకు వినతి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కప్పరాడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య వసతులు కల్పించాలని కార్పొరేటర్ గంకల కవిత శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో గంకల కవిత మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. అరకొర మందులు, సదుపాయాల లేమితో రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు చేశారు. వైద్యులను నియమించి, రోగుల రక్తపరీక్షలకు సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గంకల అప్పారావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచరూ!

డాబాగార్డెన్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టైమ్ స్కేల్ ఉద్యోగులుగా వివిధ హోదాల్లో ఏళ్లతరబడి పనిచేస్తున్నవారి ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని ఆంధ్రా యూనివర్సిటీ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. నగర పర్యటనకు వచ్చిన సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


జగద 2 : కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

జగదాంబ కూడలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మీ అమ్మవారి మార్గశిర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు జరిగాయి. పంచామృతాభిషేకం, లక్ష్మీహోమం, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యాపారాయణ, పూర్ణాహుతి నిర్వహించారు, క్షీరాభిషేక సేవలను అర్చకులు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దర్శనాల్లో ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

కులశేఖర్ లేనిలోటు తీరనిది'


కులశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

సీతంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలో జన్మించి నగరంలోని బీవీకే కళాశాలలో డిగ్రీ చదివి, చిత్రం సినిమా ద్వారా సినిమా గీత రచయితగా పేరు పొందిన ప్రముఖ గాయకుడు, ప్రప్రథమ మనస్వినీ అవార్డు గ్రహీత కులశేఖర్ 53 ఏళ్ల వయసులో మరణించడం తెలుగు సినీ పరిశ్రమకు తీరనీ లోటని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో కులశేఖర్ సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కులశేఖర్ గురువు వై.సత్యారావు, సహవిద్యార్థి, రచయిత లోగిస లక్ష్మీనాయుడు, డాక్టర్ బాబ్జీ, హంస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, నరసింహారావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్ నివారణకు వ్యాక్సిన్


బాలికకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ షిరీన్, చిత్రంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తదితరులు

జగదాంబ కూడలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ కేన్సర్ బారిన పడకుండా బాలికలకు వ్యాక్సిన్ ఉపకరిస్తుందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద పేర్కొన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా శుక్రవారం కోటవీధి మత్స్యకార సామాజిక భవనంలో వ్యాక్సిన్ వేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో గర్భాశయ కేన్సర్ ప్రమాదం ఉండదన్నారు. ఆరు నెలల తర్వాత మరో డోసు వేసుకోవాల్సి ఉంటుందన్నారు. చైతన్య స్రవంతి సేవా సంస్థను ఆయన అభినందించారు. సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబ బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. జర్నలిస్టు సంఘం ప్రతినిధులు పి.నారాయణ, గంట్ల శ్రీనుబాబు, సీరం ఇనిస్టిట్యూట్ మేనేజర్ రాంరతన్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చర్యలపై సమీక్ష


అధికారులతో సమావేశమైన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం

అక్కయ్యపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యవస్థ నిర్మూలనలో జిల్లా కార్మిక శాఖాధికారులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న చర్యలపై ఆరా తీసేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం, ఆదిలక్ష్మి తిపర్లు శుక్రవారం అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయానికి వచ్చారు. కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.సునీత అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. గత రెండేళ్లలో జిల్లాలో, నగరంలో గుర్తించిన బాల కార్మికులపై ఆరా తీశారు. హోటళ్ళు, ఇటుక బట్టీలు, ఇంటి పనులు, కార్ఖానాలు, ఇతర రంగాల్లో వారిని ఎక్కడెక్కడ గుర్తించారు? యజమానులపై ఎన్ని కేసులు నమోదు చేశారో వివరాలు అడిగారు. బాధ్యులకు పడిన శిక్షలు, తప్పించుకుంటున్న వారి శాతం వంటి వివరాలను నిశితంగా రాబట్టారు. అపరాధ రుసుములు బ్యాంకుల్లో జమ చేస్తున్నారా? అన్న విషయం పరిశీలించారు. బాల కార్మికులుగా గుర్తించిన పిల్లల భవిష్యత్‌కు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు. వారికి విద్యాబోధనలో జిల్లా విద్యాశాఖాధికారులు అందిస్తున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్లు జి.రాజు, ఆర్.రమాదేవి, ఎస్.గోవింద్, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి లక్ష్మి, ఐసీపీయూ ప్రతినిధులు మమత, ఆనంద్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ



విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్‌ఐసీ ఉద్యోగి, అంతర్జాతీయ బ్లూ బ్యాడ్జి అంపైర్ ప్యానల్ హోల్డర్ డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి బెంగళూరులో జరిగే జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీకి సీనియర్ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఎల్‌ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరుగా, టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న శర్మ...జాతీయ టోర్నీకి అంపైర్‌గా నియమితులు కావడంపై ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్, ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఎం.కామేశ్వరి, కార్యదర్శి జి.వరప్రసాద్, సంఘం ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

రైల్వే సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్


సివిల్ డిఫెన్స్ సిబ్బందితో సంభాషిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పౌర రక్షణ దినోత్సవం సందర్భంగా వాల్తేరు రైల్వే సివిల్ డిఫెన్స్ శాఖ శుక్రవారం డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని సివిల్ డిఫెన్స్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్తు సమయంలో స్టేషన్‌లో చిక్కుకున్నవారిని రక్షించడం, అగ్ని ప్రమాదాల నుంచి కాపాడడం, ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాలపై మాక్ డ్రిల్ ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో అధికారులు, సివిల్ డిఫెన్స్ వలంటీర్లు, ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు మాట్లాడుతూ సమాజ సేవలో సివిల్ డిఫెన్స్ కీలక బాధ్యతలు నిర్వహిస్తుందని, గుంపు నియంత్రణ చర్యలతోపాటు ప్రమాద, విపత్తు సమయాల్లో సహాయక చర్యలలో ముందుండి ప్రజలను కాపాడడంలో విశేష పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వై.రెడ్డి, ఇతర సిబ్బంది డ్రిల్ నిర్వహించారు. ఏడీఆర్ఎం ఇ.శాంతారామ్, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్, సివిల్ డిఫెన్స్ ఆఫీసర్ సిద్దార్థ ప్రధాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

... 7వ పేజీ తరువాయి

ముందుండేలా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. తనపై విశాఖ ప్రజలు ఎంతో నమ్మకాన్ని ఉంచి ఆదరించారన్నారు. ఇక్కడి ప్రజలు ఎంతో మంచివాళ్లని, టీడీపీపై ఎంతో అభిమానాన్ని కలిగి ఉన్నారన్నారు. విశాఖవాసులు కమిటెడ్‌గా ఉంటారన్నారు. తాను ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలను చూశానని, ఇటువంటి భిన్నమైన నగరాన్ని ఎక్కడా చూడలేదన్నారు. మంచి, చెడులను గమనించి నిర్ణయాలు తీసుకోవడంలో ఇక్కడి ప్రజలు ముందుంటారన్నారు. ఒకప్పుడు ఐటీని ప్రమోట్ చేశామని, ఇప్పుడు డీప్ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నామన్నారు. విశాఖలో అనేక కీలక సంస్థలు తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయన్నారు.

ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

... 7వ పేజీ తరువాయి

తమను (చంద్రబాబు) అడ్డుకున్న వైసీపీ నేతలపై చర్యలు విషయంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని టీడీపీ పీఆర్వో కె.గోపాలరెడ్డి ఫిర్యాదు చేశారు. వైసీపీ కీలక వ్యక్తులను ఉద్దేశపూర్వకంగా అప్పటి పోలీసులు తప్పించి, సామాన్య కార్యకర్తల పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వైసీపీ నాయకుల పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చి, చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పాఠశాలల్లో పండుగ

... 7వ పేజీ తరువాయి

ఒకటి నుంచి పదో తరగతి వరకు 77,165 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 72,918 మంది పాఠశాలల్లో భోజనం చేస్తున్నారు. మరో 60 వేల మందికి భోజనం సిద్ధం చేస్తున్నారు. మెనూ ప్రకారం అన్నం, పప్పుచారు, కూర, స్వీట్ పొంగలి, శనగపప్పు చిక్కీ అందిస్తారు. ఉదయం తల్లులకు రాగి జావ అందజేస్తారు. నగరంతోపాటు, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో భోజనం సరఫరా చేసే అక్షయపాత్ర ఏజెన్సీ ఒక్కటే 75 వేల మందికి ఆహారం సిద్ధం చేస్తోంది. జిల్లాలో పేరెంట్, టీచర్ మీటింగ్‌కు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనేందుకు 25 పాఠశాలలను ఎంపిక చేశారు. శనివారం నిర్వహించనున్న సమావేశాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

నేడు ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

... 7వ పేజీ తరువాయి

కార్యక్రమానికి హాజరయ్యే వారందరికీ స్నాక్స్ పంపిణీ, గుర్తింపు కార్డులు పరిశీలించి లోపలకు పంపించేందుకు సీనియర్ ఫ్యాకల్టీ 30 మందితో పది కమిటీలను ఏర్పాటు చేశారు.

అతిథులు...

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ, విశిష్ట అతిథిగా విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గ్రంధి మల్లికార్జునరావు, చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావుతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకానున్నారు.

ఇదీ షెడ్యూల్..

బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 5.30 గంటలకు అతిథుల ప్రసంగాలు ప్రారంభమవుతాయి. ఇవి రెండు గంటలు కొనసాగుతాయి. రాత్రి 8 గంటలకు వేడుకలు ముగియనున్నాయి.

ఏయూ వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ ఏర్పాటయ్యేదెన్నడో!?

... 7వ పేజీ తరువాయి

సంబంధించి ఉన్నత విద్యా శాఖ నుంచి వర్సిటీ అధికారులకు సమాచారం రాకపోవడంతో ఏయూ నుంచి నామినీ పేరును ఖరారు చేయడం సాధ్యం కాలేదు. దీంతో ఇప్పటివరకూ సెర్చ్ కమిటీ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు.

ఆశావహుల్లో ఉత్కంఠ

ఏయూ పూర్తిస్థాయి వైస్ చాన్సలర్‌గా వచ్చేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. ఈ జాబితాలో సుమారు పది మంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరంతా తమ స్థాయిల్లో ప్రయత్నాలను సాగిస్తున్నారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు ఎంపీ ఎం.శ్రీభరత్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పొరుగు జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుల ద్వారా కొందరు సీనియర్ ప్రొఫెసర్లు తమ ప్రయత్నాలను సాగిస్తున్నారు. మరికొందరు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నగర పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎవరికి అవకాశాన్ని కల్పిస్తుందో చూడాలి. ఏదిఏమైనా సెర్చ్ కమిటీ ఏర్పాటైతేనే గానీ వీసీ ఎంపిక ప్రక్రియ ముందుకుసాగదు.

8న బ్రాహ్మణ కులస్థుల ఆత్మీయ కలయిక

ఆటోనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న పెదగంట్యాడ ఆటోనగర్ గంగవరం రహదారిలో విశాఖ బ్రాహ్మణ కులస్థుల ఆత్మీయ కలయిక, వనసమారాధన నిర్వహిస్తున్నట్టు బ్రాహ్మణ కుల సంఘం సెక్రటరీ నాగేంద్ర పరిమి, ఐలా కమిటీ సభ్యులు చుండూరు విశాలాక్షి తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఎంఎస్ఎంఈ, ఎస్ఆర్డీసీ, డీబీసీ, ఎస్‌సీబీసీ బ్యాంకులు, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలు పాల్గొంటాయన్నారు. అక్కడ వివిధ కంపెనీల ఎక్స్‌పో నిర్వహిస్తున్నామనీ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు నూతన వ్యాపార అవకాశాలపై అవగాహనను కల్పిస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో లక్ష్మి, శర్మ, బీజేపీ మూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును ఆదుకోండి


ఓఎస్‌డీకి వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు గుర్తింపు యూనియన్ నేతలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీలోని ఉక్కు మంత్రిత్వ శాఖ ఓఎస్‌డీ ఎంజె చేతన్‌ను ఉక్కు గుర్తింపు యూనియన్ నాయకులు కోరారు. ఢిల్లీలో శుక్రవారం వారు చేతన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్లాంట్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని, ఉత్పత్తికి తగ్గ ముడిసరుకు పూర్తిస్థాయిలో ఇవ్వాలని, ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపి వేయాలని విన్నవించారు. ఓఎస్డీని కలిసిన వారిలో గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు, ఉపాధ్యక్షుడు జె. రామకృష్ణ, డొక్కా నరసింగరావు ఉన్నారు.

టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలని ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :స్టీల్‌ప్లాంట్‌లో నిలిచిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులు ప్రారంభానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు శుక్రవారం ప్లాంట్ అడ్మిన్ భవనం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌లో పలు విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల టెండర్ల ప్రక్రియ ముగిసిందని, దీంతో వందల మంది కాంట్రాక్టు కార్మికులు ఉపాధికి దూరమయ్యారని పేర్కొన్నారు. కార్మికుల ఇబ్బందులను యాజమాన్యం దృష్టిలో పెట్టుకొని టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధం తప్పనిసరి

కూర్మన్నపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్‌లో కాలనీవాసులు శుక్రవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. వడ్లపూడి చేపల, మాంసం మార్కెట్లకు స్టీలు గిన్నెలు, జూట్, క్లాత్ బ్యాగులతో వెళ్లి ప్రజలకు ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, నాగభూషణం, పరమేశ్వర రావు, పరమానందం, మూర్తి, సన్యాసిరావు, వసంత రెడ్డి తదితర కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ మోహిని, లక్ష్మి(గాజువాక), లిఖిత (శ్రీహరి పురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 46, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 28, క్యారెట్ 64 దొండకాయలు 32, బంగాళ దుంపలు 38, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 28, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 32 దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 48, కీరదోస28, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండ ఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	85
ఫారం ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, పాల్గొన్న అధికారులు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు అన్నారు. గ్రేటర్ విశాఖ 69వ వార్డులోని అక్కిరెడ్డిపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పలు అవగాహన లేని చట్టాలు, భూకబ్జాల కారణంగా భూములకు సంబంధించి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. సుమారు 33 రోజుల పాటు నిర్వహించే ఈ రెవెన్యూ సదస్సులలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధిత అధికారులు 45 రోజుల్లోగా పరిష్కరించాలని కోరారు. ఈ సదస్సులో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, కార్పొరేటర్ గుడివాడ అనూష, గాజువాక సబ్ రిజిస్ట్రార్ తారకేశ్, తెలుగుమహిళా జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, గుడివాడ లతీశ్, ఆర్ఐ మృదులతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కాగా, సదస్సు నిర్వహణపై అధికారులు సరైన సమాచారం అందజేయకపోవడంతో స్థానికుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించ లేదు. టీడీపీ నేతలు.. తమతో పాటు, బీజేపీ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదంటూ ఎమ్మెల్యే పల్లా దృష్టికి పలువురు జనసేన నేతలు తీసుకెళ్లారు.

అంబేడ్కర్‌కు నివాళి

పలు చోట్ల వర్ధంతి కార్యక్రమాలు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్టీల్‌ప్లాంటు జీఎం (వెల్ఫేర్) మధుసూదనరావు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్టీల్‌ప్లాంట్ జీఎం (వెల్ఫేర్) మధుసూదనరావు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఉక్కునగరం అంబేడ్కర్ పార్కులో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎస్సీ, ఎస్టీ లైజన్ అధికారులు నల్లి సుదర్శనం, బాబునాయక్, నాయకులు సురేష్‌బాబు, సత్యనారాయణ, మోహన్‌బాబు, పుల్లారావు పాల్గొన్నారు.

గాజువాకలో అంబేడ్కర్ విగ్రహానికి గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గూటూరు శంకరరావు, ప్రకాష్, యువశ్రీ, బొత్స జగదీష్, రంగ నాయకులు పాల్గొన్నారు.

అగనంపూడి : స్థానిక సత్రం జంక్షన్ కూడలిలో గల మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సింధియా : పారిశ్రామిక ప్రాంతం 40, 62, 63 వార్డుల్లో గల ఏకేసీ కాలనీ, కాకరలోవ, ఏఎస్సార్ కాలనీ, ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. పలువురు దళిత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం : డా.బి.ఆర్.అంబేడ్కర్ అందరివాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు సిద్దార్థ నగర్‌లో కాలనీ నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పొన్నాడ వాసుదేవరావు, టీడీపీ జిల్లా నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, బాల భాస్కరరావు, రాజన్ రాజు పాల్గొన్నారు.

జీవీఎంసీ 87 వార్డు కణితి, 86 వార్డు ఉడా నగర్‌లలో దళిత సంఘాల నాయకులు గాలి ఆనంద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రగడ వేణుబాబు, మాటూరి శ్రీనివాసరావు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోంగార్డు రైజింగ్ డే వేడుకలు


మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంటు సీజీఎం (హెచ్‌ఆర్) గాంధీ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భద్రతలో హోంగార్డులు అందిస్తున్న సేవలు విశేషమైనవని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీ అన్నారు. స్టీల్‌ప్లాంట్ హోంగార్డు బ్యారెక్స్‌లో శుక్రవారం హోంగార్డు రైజింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతలో పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బందితో సమానంగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. టౌన్‌షిప్ భద్రతకు హోంగార్డుల సేవలు విశేషమైనవన్నారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ మాట్లాడుతూ భద్రత విషయంలో హోంగార్డులు నిరంతరం పనిచేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ హోంగార్డు అంటే సమాజంలో ఓ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు పతకాలు అందించారు. కార్యక్రమంలో జీఎం లలన్‌కుమార్, డీజీఎం అంజనీకుమార్, పలు విభాగాల అధికారులు, సీఐఎస్ఎఫ్, హోంగార్డు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల వినతి


మండల్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-2 విభాగంలో కార్మికుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరు తూ విభాగాధిపతి మండల్‌ను ఇంటక్ నాయకులు కోరారు. శుక్రవారం విభాగాధిపతిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ఎల్‌డీ-1లో గల సింగిల్ కన్వర్టర్‌లో రోజుకు సుమారు 25నుంచి 35వరకు హీట్‌లు తీస్తున్నామని, ఉత్పత్తిలో రోజు రోజుకు రికార్డు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అయితే ఈ విభాగంలో ఎటువంటి సమస్యలు లేకుండా ఉత్పత్తికి ఆటంకం లేకుండా చేయాలని కోరారు. ముఖ్యంగా కార్మికులకు జీతాలు ఇవ్వకపోవటం సరికాదని, జీతాలు ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం చేయరాదని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీవీ.రమణమూర్తి, శ్రీరంగం సాయి. మంత్రి గిరి, నారాయణ సాహూ, గంట్ల శ్రీను, చందు, అఖిల్ పాల్గొన్నారు.

శబరిమల యాత్రకు సైకిళ్లపై అయ్యప్ప భక్తులు


సైకిళ్లపై యాత్రకు బయలు దేరిన అయ్యప్ప స్వాములు

అగనంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసకు చెందిన 13 మంది అయ్యప్ప భక్తులు శుక్రవారం సైకిళ్లపై శబరిమలకు బయలుదేరి వెళ్లారు. స్థానిక మరిడిమాంబ ఆలయంలో గురు స్వామి గంగాధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు కట్టారు. 1800 కిలోమీటర్లకు పైగా సైకిళ్లపై ప్రయాణం చేసి శబరిమలకు చేరుకుంటామని గురుస్వామి తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



నిర్వాసిత కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

అగనంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ కొండయ్యవలసలో వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ హెల్త్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కో-ఆర్డినేటర్ శ్రావణి మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పౌష్టికాహంతోనే మంచి ఆరోగ్యం లభిస్తోందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారుల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె విపులంగా వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, పట్టా పైడిరత్నం, పద్మ, అంగన్‌వాడీలు విజయకుమారి, గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతతోనే ప్రమాదాల నివారణ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతతోనే ప్రమాదాలు నివారించవచ్చని భద్రత విభాగం హెచ్‌వోడి ఎంఎస్ఎస్ రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ భద్రత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాంట్ గేటు వద్ద ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగ నియంత్రణ తప్పకుండా పాటించాలని, కారు నడిపే వారు, సీటు బెల్ట్‌ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.

86వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వాలు సేకరిస్తున్న నల్లూరు సూర్యనారాయణ, టీడీపీ ఇతర నేతలు

కూర్మన్నపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్‌లో శుక్రవారం టీడీపీ వార్డు ఇన్‌ఛార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. సభ్యత్వ నమోదుతో కార్యకర్తతో పాటు కుటుంబానికి భరోసా, భద్రత, ప్రమాద బీమా రూ.2 లక్షలు నుంచి రూ. 5 లక్షల వరకూ పెంచారన్నారు. నియోజకవర్గంలో ప్రతిఒక్కరూ విధిగా సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి వేగుంట శ్రీనివాస్, వార్డు టీడీపీ నాయకులు కనకరాజు, నాగార్జున, వేంకటేశ్, రాధ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సత్యకుమార్‌ను శాలువాతో సత్కరిస్తున్న శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి

మంత్రి సత్యకుమార్‌కు ఘన సన్మానం

వేపగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలో శంకర్ ఫౌండేషన్ చేపట్టిన నేత్ర శస్త్ర చికిత్సలు, ఇతర వైద్య సేవలు గురించి ఫౌండేషన్ డీజీఎం కె. బంగ్రరాజు మంత్రికి వివరించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

వేపగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పినగాడిలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

పెందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పినగాడి గ్రామంలో రూ. 50 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ రోడ్ స్థలంలో జరిగిన పనులను ఆ శాఖాధికారులు అడ్డుకునేందుకు యత్నించారు. ఈ సమాచారం తెలిసిన టీడీపీ నేత బయిలపూడి హరగోపాల్ అక్కడికి చేరుకుని వివాదాన్ని సమీక్షించారు. విషయాన్ని ఆయన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో ఫోన్‌తో మాట్లాడారు. ఈమేరకు ఆ శాఖాధికారులు అక్కడి నుంచి వెనుతిరగడంతో పనుల ప్రక్రియ ముందుకు సాగింది.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

» వాడవాడలా వర్ధంతి సభలు
» అంబేడ్కర్ సేవలను కొనియాడిన నేతలు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మల్కాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సభలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు అంబేడ్కర్ సేవలను కొనియాడారు. మల్కాపురం ఎస్సీ కాలనీలో రామ్-రాంజీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు ఎంవీ గిరి, కాకర గోవిందరాజు, పెద్దడ భూలోకరాజు, పెద్దాడ హరికృష్ణ, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అలాగే 59వ వార్డు 83 బూత్ పరిధిలోనూ అంబేడ్కర్ వర్ధంతి జరిగింది. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్ బాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ములగాడ మండల అధ్యక్షుడు గురుమూర్తి, వార్డు బీజేపీ ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్, పశ్చిమ నియోజకవర్గం బీజేపీ ప్రతినిధి లక్కరాజు రామకృష్ణ పాల్గొన్నారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జరిగిన కార్యక్రమంలో ఎస్సీ నాయకులు పూండి మల్లేశ్వరరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. కార్యక్రమంలో గాజువాక డిపో ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి : మండలంలోని రాంపురంలో ఉన్న వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పిలి దేవీ కనకరాజు, మెంటి మహేశ్, చిరికి దేవుడు, కోరాడ చందుయాదవ్ పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ సభ్యుడు బోనెల యేసు, జోసెఫ్ పూలమాల వేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో చిన ముషిడివాడ వుడాకాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు.

ఏకాదశ ఆలయంలో ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ


ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

మల్కాపురం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం రెడ్డివీధిలో సీతారామరెడ్డి యువ జన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఏకదశ దేవాలయంలో పలు విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించారు. కోదండరామ, రామలింగేశ్వర, గౌరీ పరమేశ్వర, లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర, గాయత్రి, లక్ష్మీగణపతి, సంతోషిమాత, అయ్యప్ప, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి,ఆంజనేయ, షిర్డీ సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకముందు ఉత్సవ విగ్రహాలకు రాజేటి శ్రీరామాచార్యులు, బ్రహ్మశ్రీ భోగాపురపు మురళీకృష్ణ శర్మ, రాజేటి సీతారామాచార్యులు పూజలు జరిపారు. శనివారం జరిగే పూజ కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి హాజరుకానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన కళా ఉత్సవ్

భీమునిపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న కళా ఉత్సవ్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయిలో నిర్వహించిన ఉత్సవ్‌లో 12 పాఠశాలలు, రెండు కళాశాలల నుంచి 125 మంది కళాకారులు హాజరై, పలు ప్రదర్శలిచ్చారన్నారు. గాత్రం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటక రంగం, దృశ్య కళలు, సంప్రదాయ కథలు చెప్పడంలో పోటీలు జరిగాయని చెప్పారు. ప్రథమ బహుమతి పొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారన్నారు. గాత్రంలో స్నేహిత, ఆర్. రమ్య, ఎ. లలితశ్రీ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.వాయిద్య సంగీతంలో పీఎస్ఎం హైస్కూల్ (భీమిలి), జడ్పీహెచ్ఎస్ (నడుపూరు), జడ్పీహెచ్ఎస్ (కాశీపురం), నృత్యంలో కె. రేష్మిత అపూర్వ (నారాయణ కాలేజి, అనకాపల్లి), ఈర్ని నిఖిత (సీటీఎం హెచ్ఎస్, భీమిలి), సీహెచ్ సౌజన్య (అంబేడ్కర్ గురుకులం, తాళ్లపాలెం)కు వరుసమూడు స్థానాల్లో నిలిచారు. నాటక రంగంలో నడుపూరు, ఆరిపాక, కాశీపురం విద్యార్థులు, దృశ్య కళలో పి. ఇంద్రకరన్, బి. జశ్వంత్, బి. జ్యోతి, సంప్రదాయ కథల విభాగంలో ఎస్. శిరీష, సీహెచ్ ఎల్లాజి, కె.భావన విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపాల్ జ్యోతికుమారి వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు ఎల్. సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, జె.మాధవి, సోమయాజులు,ఎస్. త్రినాథరావు, ఎం.మహాలక్ష్మి, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతికుమారి


వినతిపత్రం చదువుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పక్కన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

పంచ గ్రామాల భూ సమస్యపై సీఎంకు వినతి

వేపగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా గోవింద్ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వై. జగదీశ్ వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో సీఎంను కలిసి సమస్య తీవ్రతను వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి


ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ శాంతినగర్‌లో కొలువైన శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి 27వ షష్ఠి, కల్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ముందుగా అర్చకులు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణం జరిపారు. సాయంత్రం తిరువీధి నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

షిప్‌యార్డుకు రెండు అవార్డులు



హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌కు రెండు అవార్డులు లభించాయి.ఈమేరకు న్యూఢిల్లీలోని షాంగ్రి-లాలో శుక్రవారం జరిగిన 3వ పీఎస్‌యూ ట్రాన్స్‌ఫర్మేషన్ వేడుకల్లో షిప్‌యార్డు ఉన్నతాధికారులు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశరత్ చంద్ర, తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం, ఆంధ్రజ్యోతి

రోజంతా బిజీ బిజీ

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సక్సెస్


పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పిస్తున్న సీఎం



డీప్ టెక్నాలజీ సదస్సులో డెలిగేట్స్‌తో సీఎం నారా చంద్రబాబునాయుడు


ముఖ్యమంత్రితో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు


స్టాల్స్‌లో పరికరాల పనితీరు తెలుసుకుంటున్న సీఎం

- పార్టీ కార్యాలయంలో వినతులు ఇచ్చేందుకు పోటీపడిన ప్రజలు
- అధినేతను కలుసుకునేందుకు బారులుతీరిన నాయకులు

నగరంలో ఒకరోజు పర్యటనకు గురువారం రాత్రి పార్టీ కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం రోజంతా బిజీగా గడిపారు. ఉదయం పార్టీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నుంచి బాధితులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనతో ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. అనంతరం నోవాటెల్ హోటల్‌లో డీప్ టెక్నాలజీపై నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించే దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కాగా సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడ వెళ్లారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


'డీప్ టెక్నాలజీ' సదస్సుకు హాజరైన ప్రతినిధులు


డీప్ టెక్ సదస్సుకు హాజరవుతున్న ముఖ్యమంత్రి


వాటర్ ఫర్ ఎయిర్ మెషీన్ పనితీరు తెలుసుకుంటున్న సీఎం


సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చిన మంత్రులు కొల్లు రవీంద్ర, డోలా బాలవీరాంజనేయ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి, పంచకర్ల, నాయకులు



'డీప్ టెక్నాలజీ' సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు


పార్టీ కార్యాలయంలో సీఎంను కలిసేందుకు వచ్చిన ఉమ్మడి జిల్లా టీడీపీ నాయకులు

చెరువులవేనం వ్యూపాయింట్ కాలిబాట సైతం మూసివేత

చింతపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లంబసింగి సమీప చెరువులవేనం వ్యూపాయింట్‌కి వెళ్లే కాలిబాటను కూడా శనివారం నుంచి మూసివేస్తున్నట్టు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో వ్యూపాయింట్‌కి వెళ్లే రహదారిపై కొండచరియలు విరిగిపడుతుండడంతో రెండు రోజుల క్రితం ఈ మార్గాన్ని మూసివేశామన్నారు. పర్యాటకులు లంబసింగి నుంచి కాలిబాటలో వెళుతున్నారని, ఈ దారిలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందన్నారు. ఈ కారణంగా నడక మార్గాన్ని మూసివేస్తున్నామన్నారు. పర్యాటకులు వ్యూపాయింట్‌కి వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పీఎంపాలెంలో చోరీ: బంగారం అపహరణ

ఎండాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్కేనగర్ లేఅవుట్‌కు చెందిన శ్రీనివాసరావు ఎంఈఎస్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చేరారు. అతని ఇద్దరు పిల్లలు శుక్రవారం పాఠశాలకు వెళ్లారు. శ్రీనివాసరావు భార్య ధనలక్ష్మి ఉదయం 9 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బాల్కనీలో వెలుపల ఉన్న పూల కుండీలో వేసి ఆస్పత్రికి వెళ్లింది. మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటికి వచ్చిన కుమార్తెకు తలుపులు తెరిచి ఉండడంతో తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. ఆమె ఇంటికి చేరుకుని చూడగా అల్మారాలోని ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఏఐతో వైద్య రంగానికి ఎంతో ఉపయోగం

- తొలి దశలోనే బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపు
- 'జననీ మిత్ర' యాప్‌తో రక్తహీనతకు చెక్
- ఏఎస్‌జీఈ అండ్ ఏఐ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి డాక్టర్ ప్రతీక్‌శర్మ


మాట్లాడుతున్న ప్రతీక్ శర్మ

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతో ఉపయోగకరమని, అమెరికాలో విస్తృతంగా వాడుతున్నామని, ఆ రంగంలో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయని అమెరికాకు చెందిన ఏఎస్‌జీఈ అండ్ ఏఐ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి డాక్టర్ ప్రతీక్‌శర్మ తెలిపారు. శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో జరిగిన 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'లో ఆయన ఏఐ గురించి మాట్లాడుతూ, ఆ టెక్నాలజీ ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్‌ను తొలి దశలో మరింత కచ్చితంగా గుర్తించగలుగుతున్నామన్నారు. ఏఐని ఉపయోగించడం వల్ల వ్యక్తిగత పర్యవేక్షణ, ఎక్కడి నుంచైనా సమాచారం తీసుకునే వెసులుబాటు వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. దీనికి సంబంధించి పాలసీలు రూపొందించాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురంలో 'జననీ మిత్ర' యాప్ ద్వారా గర్భిణీ, తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని ట్రాక్ చేయగలుగుతున్నారని చెప్పారు. వారు తీసుకునే ఆహారాన్ని యాప్‌తో ఫొటో తీస్తే...అందులో ఎన్ని క్యాలరీలు ఉన్నాయో తెలిసిపోతుందన్నారు. నాలుక, గోళ్లను పరిశీలించడం ద్వారా రక్తహీనతను ముందుగానే దీని ద్వారా గుర్తించవచ్చునన్నారు. త్వరలోనే దీనిని ఏపీ ప్రభుత్వం ఉపయోగించనుందని ఏఏఐఎం ఈడీ డాక్టర్ రాకేశ్ కలపాల తెలిపారు. ఈ యాప్‌ను రూపొందించడానికి ఏపీ మెడ్‌టెక్ జోన్, ఏషియన్ హెల్త్ కేర్ ఫౌండేషన్, ఐఎస్‌బీ, ఐఐటీ హైదరాబాద్ సహకరించాయన్నారు. ఇదే వేదికపై 'ఏఐ ఫర్ ఎవ్విరివన్', 'స్వర్ణ ఆంధ్ర అండ్ ట్రాన్స్‌ఫార్మింగ్ టు వికసిత భారత్' అనే రెండు పుస్తకాలను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు.

గాజువాకలో సియా ఫైన్ సిల్వర్ జ్యూవెలరీ షోరూం ప్రారంభం


సియా ఫైన్ సిల్వర్ జ్యూవెలరీ షోరూంను ప్రారంభిస్తున్న శ్రీకన్య గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కేతవరపు గురుమూర్తి

గాజువాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గాజువాకలో పెరుగుతున్న ఆభరణాల ప్రపంచంలోకి మరో సరికొత్త నగల దుకాణం సియా ఫైన్ సిల్వర్ జ్యూవెలరీ చేరింది. గాజువాకలో సియా ఫైన్ సిల్వర్ జ్యూవెలరీ షోరూంను శుక్రవారం శ్రీకన్య గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కేతవరపు గురుమూర్తి ప్రారంభించారు. గాజువాక ప్రజలకు అద్భుత, ఆకర్షణీయమైన నైపుణ్యం ప్రతిబింబించే ఆభరణాలను అందించాలనే లక్ష్యంతో ఈ షోరూంను ప్రారంభించినట్టు నిర్వాహకులు తెలిపారు. తమ షోరూంలో సంప్రదాయ, కళాత్మక సమ్మిళితమైన చూడముచ్చట గొలిపే వెండి ఆభరణాలు లభిస్తాయని, చూడగానే ఆకర్షించే బంగారు నగలకు దీటుగా రూపొందించిన ఎన్నో రకాల వెండి ఆభరణాలు లభ్యమవుతాయని పేర్కొన్నారు. ఖాతాదారులకు మెరుగైన ఆఫర్లు ప్రవేశపెట్టామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

డీప్ టెక్నాలజీతో ఆరోగ్య రంగంలో మార్పులు

- ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్


మాట్లాడుతున్న మంత్రి

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డీప్ టెక్నాలజీ సాధనాలు వైద్య సేవల రూపురేఖలను సమూలంగా మారుస్తాయని, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. నోవాటెల్‌లో జరిగిన డీప్‌టెక్ కాన్‌క్లేవ్‌లో మంత్రి మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాల చారిత్రక విశ్లేషణ అంచనా ప్రకారం ఒక వ్యక్తి జీవిత కాలంలో ఒక శాతం పెరుగుదల జీడీపీకి అదనంగా ఆరు శాతం, తలసరి ఆదాయానికి ఐదు శాతం సహకరిస్తుందని నిరూపితమైందన్నారు. ప్రజల ఆర్థిక స్థోమతకు తగిన ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి రావాలన్నారు. డీప్ టెక్నాలజీ స్వీకరణకు రాష్ట్రం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో పది వేలకుపైగా గ్రామస్థాయి హెల్త్ క్లినిక్‌లు, 1700 గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 250 జిల్లా, ఏరియా, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు ఉన్నాయన్నారు. ప్రతిభావంతులైన యువతకు కొదవ లేదన్న మంత్రి డీప్ టెక్ పరిష్కారాలు, ఆరోగ్య వ్యవస్థాపనలపై దృష్టిపెట్టాల ని సూచించారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడా నికి, తద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ కలను సాకారం చేసుకునేందుకు స్పష్టమైన పాలసీని రూపొందించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

నేటి నుంచి వాడపల్లికి ఆర్టీసీ బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వెంకటేశ్వరుని దర్శనానికి శనివారం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ప్రతి శనివారం తెల్లవారుజామున 4 గంటలకు ద్వారకా కాంప్లెక్సులో బస్సు బయల్దేరుతుంది. ఉదయం 10 గంటలకు వాడపల్లి చేరుతుంది. స్వామి దర్శనం అనంతరం, పరిసరాల్లో దర్శనీయ స్థలాలను సందర్శించి సాయంత్రం 4 గంటలకు తిరుగు ప్రయాణమై రాత్రి 9 గంటలకు విశాఖ చేరుతుంది. దేవస్థానంలో మధ్యాహ్నం ఉచిత భోజనం అందిస్తారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి టికెట్ నిర్ణయించారు. 35 మంది జట్టుగా వెళ్లదలస్తే కావాల్సిన సమయంలో బస్సు నడుపుతామని ఆర్ఎం బి.అప్పలనాయుడుతెలిపారు.

13న సింహగిరిపై హనుమత్ వ్రతం

సింహాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింహగిరి మెట్లమార్గంలోని సాక్షి ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 13న హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు ప్రకటించారు. ఆరోజు ఉదయం 7.30గంటలకు అంకురారోపణ, రుత్విక్ వరుణలతో ఉత్సవానికి శ్రీకారం చుడతారు. మూడురోజుల పాటు సుందరకాండ పారాయణ, ప్రత్యేక హోమం, 13న ఉదయం స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష వస్త్రాలంకరణ, లక్ష తమల పత్రార్చన, ప్రత్యేక హవనము, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.

వ్యాపారాభివృద్ధికి సమ్మిట్‌లు దోహదం

- ఎంఎస్‌ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్


మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఎండాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేట్‌లతో కలిసేందుకు వీలుగా ఒక ప్లాట్‌ఫామ్‌ని అందిచడానికి ప్రొక్యూర్‌మెంట్ సమ్మిట్ దోహదపడుతుందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, (ఎంఎస్‌ఎంఈ), గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో గీతం విశ్వవిద్యాలయం వేదికగా ఎంఎస్‌ఎంఈ ప్రొక్యూర్‌మెంట్ సమ్మిట్‌ను శుక్రవారం ప్రారంభించి మాట్లాడుతూ ఎంఎస్‌ఎంల వ్యాపారాభివృద్ధికి సమ్మిట్ దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం రూపొందించిన నూతన పాలసీ ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంఎస్‌ఎంఈల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మారెడ్డి శివశంకర్‌రావు, సీఐఐ గత ఛైర్మన్ ఆర్‌వీఎస్ రుద్రరాజు, సీఐఐ ఎస్ఆర్ టాస్క్‌ఫోర్స్ ఎంఎస్‌ఎంఈ, ఈవోడీబీ ఛైర్మన్ ఎం.పొన్నుస్వామి ఎంఎస్‌ఎంఈల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను చర్చిం చారు. అంతకుముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు.

క్రైం... crime news

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కూర్మన్నపాలెం, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు శుక్రవారం గుర్తించారు. జీఆర్పీ ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫాం చివరన రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉంది. మృతుని కుడి చేతిపై అన్నపూర్ణ తమ్ముడు, గుండెభాగంలో ఎడమ వైపున అమ్మ, కుడివైపు నాన్న అని పచ్చబొట్లు ఉన్నా యి. వయసు 35-40 ఏళ్ల మధ్య ఉంటుంది. మెరూన్ కలర్‌ప్యాంటు, తెలుపు, నలుపు రంగు నిలువు గీతల ఫుల్‌హ్యాండ్ షర్టు, నలుపు రంగు తువ్వాలు ఉన్నాయి. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే 73820 58996 నంబరులో సంప్రతించాలని ఎస్ఐ సూచించారు.

పీఎం పాలెంలో వివాహిత ఆత్మహత్య

ఎండాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిద్రమాత్రలు మింగి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పీఎం పాలెం చివరి బస్టాప్ వద్ద శుక్రవారం జరిగింది. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు... శ్రీకాకుళం జిల్లాకు చెందిన కీరపు హేమంతరెడ్డి, భారతీరెడ్డి (25) దంపతులు నాలుగేళ్ల కుమార్తెతో కలిసి పీఎంపాలెం చివరి బస్టాప్ ప్రాంతంలో ఉంటున్నారు. హేమంతరెడ్డి జొమాటాలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన భార్య ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేయడం చూసి ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని అత్తమామలతో పాటు కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారూ ఆమెని మందలించారు. దీంతో ఆవేశంగా భారతీరెడ్డి మరో గదిలోకి వెళ్లిపోయి నిద్రమాత్రలు మింగేసింది. ఈ విషయం కుమార్తె హేమంత్‌రెడ్డికి చెప్పడంతో స్థానికుల సహాయంతో మధురవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

నర్సీపట్నంలో ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య


అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓ ఆర్మీ ఉద్యోగి శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు నాతవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన బొచ్చా శివ అప్పలనాయుడు ఆర్మీలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం జమ్ముకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. మూడేళ్ల క్రితం విశాఖపట్నానికి చెందిన హేమలతతో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి రెండేళ్ల కుమార్తె వుంది. సెలవుపై గురువారం స్వగ్రామం వచ్చాడు. సాయంత్రం వరకు కుటుంబ సభ్యులతో గడిపాడు. అనంతరం నర్సీపట్నం వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా వున్న కె.ఎస్.ఆర్. లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు గది తలుపులు తెరవకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి తలుపులు తెరిచారు. అప్పలనాయుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేయగా టౌన్ సీఐ గోవిందరావు వివరాలు సేకరించి, కుటుంబసభ్యులకు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైల్లో సికింద్రాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని రూ.86 వేల విలువ చేసే 17.3 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. జీఆర్పీ ఎస్ఐలు రామారావు, జూలీ కర్మాకర్ ఆర్పీఎఫ్ సిబ్బందితో శుక్రవారం తనిఖీలు చేస్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన రమార్ సెల్లాంగంజాయి రవాణా చేస్తూ దొరికాడని హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు తెలిపారు. అతడిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

యువకుడిపై దాడి: ముగ్గురి అరెస్టు

ఎండాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువతి కోసం జరిగిన ఘర్షణలో ఓ యువకుడిపై ముగ్గురు దాడిచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదరుషికొండలోని ఓ లాడ్జిలో పది రోజులుగా కంచరపాలెం ప్రాంతానికి చెందిన యువతి, విజయనగరం జిల్లాకు చెందిన పి.సాయికుమార్‌రెడ్డి ఉంటున్నారు. యువతితో పరిచయమున్న పీఎంపాలేనికి చెందిన పి.వినయ్ ఆమెకి పలుమార్లు ఫోన్ చేయడంతో ఆమె స్నేహితురాలిని కలిసి వస్తానని వినయ్‌ని కలిసి తిరిగి రాత్రి తొమ్మిది గంటలకు లాడ్జికి రావడంతో సాయిరెడ్డి ప్రశ్నించాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో వినయ్‌కి తెలిపింది. అతడు సాయికుమార్‌రెడ్డికి ఫోన్ చేయడంతో పాటు తన స్నేహితులు కంచరపాలేనికి చెందిన ప్రకాష్, శివకుమార్‌లతో సహా లాడ్జికి చేరుకుని సాయిపై కర్రలతో దాడి చేశాడు. సాయి ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.